## మళ్లీ కైలాశ్, మానస సరోవర్ యాత్రలు

న్యూఢిల్లీ : భారత్, చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల విషయంలో మరో ముందడుగు పడింది. రానున్న వేసవిలో కైలాశ్, మానస సరోవర్ యాత్రలను పునరుద్ధరించాలని ఇరు దేశాలు నిర్ణయించా యి. టిబెట్‌లో ఉన్న ఈ పవిత్ర క్షేత్రాల సందర్శన కరోనా కా రణంగా 2020 నుంచి నిలిచిపోయాయి. అనంతరం గల్వాన్ ఘర్షణల నేపథ్యంలో ఒప్పందాలను పునరుద్ధరించుకోలేదు. తాజా గా రెండు రోజుల పర్యటన నిమిత్తం చైనా వెళ్లిన భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ బీజింగ్‌లో చైనా ఉప విదేశాంగ మంత్రితో జరిపిన చర్చల్లో ఈ విషయమై అంగీకారం కుదిరింది. మరోవైపు, రెండు దేశాల మధ్య నేరుగా తిరిగే విమాన సర్వీసులను కూడా పునరుద్ధరించాలని ఇరు దేశాలు సూత్రప్రాయంగా అంగీకరించాయి. ఇందుకు సంబంధించిన సాంకేతిక అంశాలపై చర్చించేందుకు రెండు దేశాల అధికారులు త్వరలోనే భేటీ కానున్నారు.

RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 3 సంచిక : 4 మేడ్చల్ మల్కాజ్‌గిరి 29 జనవరి 2025 బుధవారం పేజీలు : 4




# పదేళ్లు నేనే సీఎం..!

## ముఖ్యమంత్రి సీటుపై రేవంత్‌రెడ్డిది

## కాన్ఫిడెన్సా? స్ట్రాటజీనా?

హైదరాబాద్ : నేనే రాజు. నేనే మంత్రి. ఇదో సినిమా టైటిల్ అయినప్పటికీ..సీఎం రేవంత్ కూడా ఇదే లైన్‌ను ఫాలో అవుతున్నారు. పదేళ్ల వరకు తానే ముఖ్యమంత్రినని..టెన్ ఇయర్స్ వరకు కాంగ్రెస్ పార్టీనే పవన్‌లో ఉంటుందని చెప్పుకొస్తున్నారు. సీఎం రేవంత్ చేస్తున్న ఈ వ్యాఖ్యల వెనుక మర్మమేంటన్నది హాట్ టాపిక్‌గా మారింది. రేవంత్ కాన్ఫిడెన్స్ వెనుక తనపై తనకున్న నమ్మకమా? కాంగ్రెస్ పార్టీలో ఎదురే లేదనే ధైర్యమా? రేవంత్ కామెంట్స్‌పై చిర్రుబుర్రు ఆడుతున్న మంత్రులెవరు?

**వచ్చే పదేళ్లు తానే సీఎంగా ఉంటానని ధీమా..** పదేళ్లు నేనే సీఎం. 2034 వరకు తెలంగాణ ముఖ్యమంత్రిని నేనే. కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుంది. ఇవీ.. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు. వచ్చే పదేళ్లు తానే సీఎంగా ఉంటానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని బలంగా నమ్ముతున్నట్లు చెప్పుకొస్తున్నారు. ఇందుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి ఓ ఉదాహరణ సైతం ప్రస్తావించారు. 1994 నుంచి 2004 వరకు ఓ రాజకీయ పార్టీకి అవకాశం ఇచ్చిన ప్రజలు, ఆ తర్వాత 2004 నుంచి 2014 వరకు మరో పార్టీకి అవకాశం ఇచ్చారని చెప్పుకొచ్చారు. 2014 నుంచి 2024 వరకు ఇంకో రాజకీయ పార్టీకి అవకాశం ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. ఇదే క్రమంలో 2024 నుంచి వచ్చే పదేళ్లు అంటే 2034 వరకు కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా ప్రజలు అవకాశం ఇస్తారని, తాను సీఎంగా ఉండి ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని రేవంత్ రెడ్డి చెబుతున్న మాట.

**కాంగ్రెస్ కొత్త చర్చకు దారితీసిన సీఎం రేవంత్ వ్యాఖ్యలు..** సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన పదేళ్ల పాటు అధికారం అన్న లాజిక్ బాగానే ఉన్నా.. సీఎంగా తాను పదేళ్ల పాటు కొనసాగుతానని చెప్పడమే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చకు దారి తీసింది. గతంలో కాంగ్రెస్ పార్టీ పవర్‌లో ఉన్నప్పుడు సీఎంలు మారారు. టీడీపీ పవర్‌లో ఉన్నప్పుడు చంద్రబాబే సీఎంగా ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆరే సీఎంగా కొనసాగారు. అలాంటిది కాంగ్రెస్ పార్టీనే పవర్‌లో ఉన్నా.. తానే పదేళ్లు సీఎంగా ఉంటానని చెప్పడమే ఇంట్రెస్టింగ్‌గా మారింది. రేవంత్ వ్యాఖ్యల వెనుక ఆంతర్యమేంటన్న చర్చ మొదలైంది. రేవంత్ రెడ్డికి తనపై తనకున్న నమ్మకంతో ఇంతలా ధీమా వ్యక్తం చేస్తున్నారా.? లేదంటే కాంగ్రెస్ అధిష్టానం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటానన్న నమ్మకమా..లేక కాంగ్రెస్‌లో తనకు తిరుగులేదనే ధైర్యంతో మాట్లాడుతున్నారా అన్నది చర్చనీయాంశం అవుతోంది.

**జనం మూడ్‌ను అట్రాక్ట్ చేసే ప్రయత్నం..!** పార్టీ పవర్‌లో ఉంటుందని చెప్పడం వరకు ఓకే..కానీ తానే సీఎంగా ఉంటానని చెప్పడం వెనుక ఏదో స్ట్రాటజీ ఉందన్న చర్చ జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తన అభిమానులు, తన వెంట నడుస్తున్న నేతలకు భరోసా కల్పించేందుకే రేవంత్ ఇలా కామెంట్ చేశారన్న టాక్ వినిపిస్తోంది. పార్టీ పవర్‌లో ఉంటుంది..తాను సీఎంగా ఉంటానని చెప్పడం జనం మూడ్‌ను అట్రాక్ట్ చేసే ప్రయత్నం కూడా ఉందంటున్నారు.

**రేవంత్ వ్యాఖ్యలను జీర్ణించుకోలేకపోతున్న కాంగ్రెస్ సీనియర్లు..!** పదేళ్ల పాటు తానే సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి స్టేట్‌మెంట్ ఇవ్వడంపై మంత్రుల నుంచి మొదలు కాంగ్రెస్ ఎమ్మెల్యేల వరకు ఆసక్తికరమైన చర్చ జరుగుతోందట. కాంగ్రెస్ అధిష్టానం పెద్దల పూర్తి స్థాయి అండతోనే రేవంత్ రెడ్డి ఇంత ధీమాగా మాట్లాడుతున్నారని చర్చించుకుంటున్నారు. ఇటు తెలంగాణ ప్రజలను, అటు కాంగ్రెస్ హైకమాండ్‌ను సంతృప్తి పరిచేలా పరిపాలన చేస్తున్నానని, మళ్లీ తానే సీఎం అవుతానన్న విశ్వాసంతో ఉన్నారట రేవంత్. అయితే ఇలా పదేళ్లు తానే సీఎం అని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేయడాన్ని భవిష్యత్‌లో ముఖ్యమంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్న సీనియర్ మంత్రులు, ప్రతిపక్షాలు మాత్రం జీర్ణించుకోలేకపోతున్నారని రాజకీయవర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

**టెన్ ఇయర్స్ సీఎంగా ఉంటానని రేవంత్ చెప్పడం వెనుక పెద్ద ప్లాన్?** టెన్ ఇయర్స్ సీఎంగా ఉంటానని రేవంత్ చెప్పడం వెనుక పెద్ద ప్లానే ఉందన్న టాక్ వినిపిస్తోంది. మళ్లీ కాంగ్రెస్ పవర్‌లోకి వస్తే..లేకపోతే ఈ టర్మ్‌లో ఏదైనా ఇబ్బందులు వస్తే తమకు సీఎం పదవి వస్తుందని కొందరు కాంగ్రెస్ సీనియర్లు ఆశ పడుతున్నారట. సేమ్‌టైమ్ ప్రభుత్వం మీద వ్యతిరేకత ఉంది..మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని కారు పార్టీ ధీమాలో ఉంది. అటు పార్టీలో సీనియర్లను..ఇటు అపోజిషన్‌ను డైలమాలో పడేసేందుకు రేవంత్ ఇలాంటి స్టేట్‌మెంట్స్ ఇస్తున్నారట.

పారిశ్రామిక వర్గాలు, అధికారులకు, ప్రజలకు అందరికీ ఓ సంకేతం పంపాలనే మాస్టర్ ప్లాన్‌తోనే రేవంత్ తానే సీఎం అంటున్నారని చర్చ జరుగుతోంది.

మరీ రేవంత్‌ది ధీమానా లేక స్ట్రాటజీనా..ఆయన ఆశించినట్లు పదేళ్లు సీఎంగా ఉండగలుగుతారా లేదా.. చూడాలి మరి.

## కెస్లాపూర్‌లో ప్రారంభమైన నాగోబా జాతర పూజలు

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కెస్లాపూర్‌లో మెస్రం వంశీయులు మంగళవారం నాగోబా జాతర పూజలను ప్రారంభించారు. గంగా జలాన్ని, ఆలయ ప్రాంగణంలోని మురాడి వద్దకు మెస్రం వంశీయులు తీసుకొచ్చారు. గ్రామంలోని పాత ఆలయం నుంచి నాగోబా విగ్రహాన్ని ఊరేగింపుగా గర్భగుడిలో భద్రపరిచారు. అనంతరం ఆలయ సమీపంలోని కోనేరు నుంచి మట్టి కుండల్లో నీటిని తీసుకువచ్చి పుట్టలు చేస్తారు.



అర్ధరాత్రి 11:30 సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభం కానుంది. పూజా కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు మెస్రం వంశీయులు పాల్గొంటారు. ఐదు రోజులపాటు జరిగే జాతరలో తెలుగు రాష్ట్రాల నుంచి కాక మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిషా రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు హాజరవుతారు.

# అభయ హస్తం డబ్బులు వాపస్.! గ్రామాల వారీగా లిస్ట్ రెడీ




హైదరాబాద్ : కొన్నేండ్లుగా నిలిచిపోయిన అభయహస్తం నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఈ పథకం కింద 2009 నుంచి 2016 వరకు రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు జమ చేసిన నిధులను తిరిగి వారికి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితా రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు అండగా నిలిచేందుకు 2009 లో కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకానికి శ్రీకారం చుట్టింది. సంఘంలో చేరిన ప్రతి మహిళా సభ్యురాలు సంవత్సరానికి రూ.365 ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం కూడా అంతే మొత్తం డబ్బులు జమ చేసింది. సంఘ సభ్యులు 60 ఏండ్ల వయసు దాటితే రూ.500 పింఛన్ అందించాలన్న లక్ష్యంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేసింది. అలాగే.. కుటుంబంలో 9, 10, ఇంటర్, ఐటీఐ చదువుతున్న వారి పిల్లలకు ఏడాదికి రూ.1,200 చెల్లించింది. సభ్యురాలు సహజ మరణం పొందితే రూ.30 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.75 వేలు, శాశ్వత వైకల్యానికి రూ.75 వేలు, పాక్షిక వైకల్యానికి రూ.37,500 చెల్లించేవారు. అయితే, 2016 వరకు ఈ పథకం సజావుగానే కొనసాగినా.. బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో నిలిపివేసింది. ఆసరా పింఛన్ ప్రారంభించి.. పింఛన్ సొమ్ము రెట్టింపు చేసింది. గతంలో అభయహస్తంలో భాగంగా కట్టిన సొమ్ము తిరిగి చెల్లిస్తామని గత ప్రభుత్వం ప్రకటనలు చేసినా.. కార్యరూపం దాల్చలేదు. 60 ఏండ్లు దాటిన మహిళలు ఇటు అభయ హస్తం, అటు ఆసరా డబ్బులు చెల్లించినా సొమ్ము రాక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అవసాన దశలో ఆసరా అవుతుందని భావించిన వృద్ధులకు నిరాశే ఎదురవుతోంది. తాజాగా ప్రభుత్వం వీరి సొమ్ము చెల్లించేందుకు ముందుకు రావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గత బీఆర్ఎస్ ప్రభుత్వం అభయ హస్తం, ఆసరా పింఛన్ సొమ్ము దారి మళ్లించిందనే ఆరోపణలు ఉన్నాయి.

**425 కోట్లు చెల్లించేందుకు సన్నాహాలు..** గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా అభయహస్తం నిధులు సుమారు రూ.425 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నది. 2009 నుంచి 2016 వరకు 21 లక్షల మంది మహిళలు జమ చేసిన సొమ్ము ప్రభుత్వం వద్దే ఉండగా.. 2022 మార్చి నాటికి అసలు, వడ్డీ కలిపి రూ.545 కోట్లయింది. 2022లో గత ప్రభుత్వం రూ.152 కోట్లు మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అది కూడా కేవలం సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లోని మహిళలకు చెందిన బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసినట్టు తెలిసింది. మరో రూ.393 కోట్లు ప్రభుత్వం వద్దే ఉండిపోయాయి. తాజాగా వడ్డీతో కలిపి సుమారు రూ.425 కోట్ల వరకు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఈ సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేలా సర్కారు నిర్ణయం తీసుకున్నది. జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితాను తయారు చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు ఆదేశాలు జారీ చేయడంతో వారు సెర్ప్ అధికారులకు ఈ బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. అభయ హస్తంలో ప్రీమియం సొమ్ము చెల్లించిన లబ్ధిదారులు ఎంత మంది? ఇందులో ఎవరైనా చనిపోయారా? ప్రస్తుత ఉన్నవారి వివరాలు, మృతిచెందిన సభ్యురాళ్ల వారసుల నుంచి ఆధార్, బ్యాంకు ఖాతాల సమాచారం సేకరిస్తున్నారు. లబ్ధిదారుల లెక్క తేలిన తర్వాత ప్రభుత్వం తిరిగి సొమ్ము వారి అకౌంట్లలో జమ చేయనున్నది. అంతేకాకుండా, గతంలో మాదిరిగా సభ్యురాళ్ల కుటుంబంలో చదువుకుంటున్న పిల్లలకు స్కాలర్ షిప్ కూడా అందజేయనున్నది.




# ఇక తగ్గేదే లే!

## తెలంగాణను అభివృద్ధి బాట పట్టిస్తా..!!

హైదరాబాద్: ఇటీవల స్విట్జర్లాండ్?లోని దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలంగాణకు రికార్డ్ స్థాయిలో పెట్టుబడులు వచ్చిన విషయం తెలిసిందే. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ టీమ్ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడులను సాధించింది.

మొత్తం నాలుగు రోజుల పాటు జరిగిన దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో 16 కంపెనీలతో ఒప్పందాల ద్వారా 1.78 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్శించింది తెలంగాణ. ఈ క్రమంలో దావోస్ పర్యటన వివరాలను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం (జనవరి 28) మీడియాకు వెల్లడించారు. సెక్రటేరియట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఏడాది దావోస్ పర్యటనలో తెలంగాణకు మొత్తం రూ. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు తెలిపారు.

ఇంకా ఎన్నో కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తి చూపాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం మీద నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన కంపెనీలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

మా ప్రభుత్వం అవలంభిస్తోన్న విధానాలే నేడు రాష్ట్రానికి భారీ పెట్టుబడులు రావడానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. రాష్ట్రానికి రికార్డ్ స్థాయిలో పెట్టుబడులు రావడం మా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అతిపెద్ద విజయమన్నారు. పెట్టుబడులు తీసుకురావడం కొత్తేమి కాదని.. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాల్లో కూడా భారీగా ఇన్వెస్ట్ మెంట్లు వచ్చాయని గుర్తు చేశారు. హైదరాబాద్?కు పెట్టుబడులు రాకుండా చేయాలని కుట్ర చేశారని.. ఎన్నో అపోహలు, అనుమానాలు సృష్టించారని ఫైర్ అయ్యారు. కానీ ఇన్వెస్టర్లు తెలంగాణ ప్రభుత్వంపై విశ్వాసాన్ని చాటుకున్నారన్నారు. రాజకీయంగా విధానాలను విభేదించినా సరే.. కానీ రాష్ట్ర ప్రజయోనాల విషయంలో రాజకీయాలు చేస్తే ఉపేక్షించబోమని ప్రతిపక్షాలకు వార్నింగ్ ఇచ్చారు. పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాం కనుకే అన్ని పెట్టుబడులు వచ్చాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం 13 నెలల్లో రూ.లక్షా 80వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు.

తెలంగాణను ట్రిలియన్ డాలర్ వ్యవస్థగా తీర్చిదిద్దడమే మా టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సింగపూర్ ప్రభుత్వంతో కీలక ఒప్పందం చేసుకున్నామని.. స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఇదో అద్భుత పరిణామమని రేవంత్ రెడ్డి అన్నారు.

## సంపాదకీయం

# సినీ తారలతో కమల విలాసం

కేంద్రంలో అధికారంలో గత పదేళ్ళుగా ఉన్న బీజేపీ సినీ తారల మీద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. వారికి అర్హత ఉన్నా అవార్డులు దక్కకపోవడాన్ని గమనిస్తూ వాటిని సరైన సమయంలో అందజేయడం ద్వారా తారల అభిమానాన్ని పొందుతోంది. తమిళనాడులో చూస్తే రజనీకాంత్ కి పద్మ విభూషణ్ 2017లో బీజేపీ ప్రభుత్వం ప్రకటించింది. ఆ తరువాత ఆయనకు దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుని కూడా ప్రకటినించి. గత ఏడాది మరణించిన తమిళనాడు స్టార్ డీఎండీకే పార్టీ ప్రెసిడెంట్ అయిన విజయ్ కాంత్ కి మరణాంతరం పద్మభూషణ్ ని ప్రకటించింది. ఆయనకు ప్రత్యేకంగా అభిమానం గణం ఉంది. అలాగే ఆయన పార్టీ క్యాడర్ కూడా బలంగా ఉంది. దాంతో బీజేపీ ఆయన అభిమానులను తిప్పుకునే ఎత్తుగడగా ఇలా చేసింది అని అంటున్నారు ఇక ఇపుడు చూస్తే తమిళ స్టార్ అజిత్ కుమార్ కి పద్మ భూషణ్ అవార్డుని కేంద్రం ప్రకటించింది. ఆయన మూడు దశాబ్దాలుగా సూపర్ స్టార్ గా తమిళనాడులో ఉన్నారు. ఆయన 1991లో ప్రేమ పుస్తకం అనే తెలుగు సినిమా ద్వారానే వెండి తెరకు పరిచయం అయ్యారు. ఆయనకు అక్కడ మంచి ఫాలోయింగ్ ఉంది. దాంతో దీని మీద అక్కడ మరో సూపర్ స్టార్ కొత్తగా పార్టీ పెట్టి రాజకీయాల్లోకి వస్తున్న విజయ్ ఫ్యాన్స్ అయితే ఫైర్ అవుతారు. తమ హీరో రాజకీయాల్లోకి వస్తున్న వేళ తోటి స్టార్ కి పురస్కారం ఇవ్వడం రాజకీయమేనని వారు అంటున్నారు. అజిత్ విషయానికి వస్తే ఆయనకు రాజకీయ వాసనలు లేవు. కానీ ఆయనను అన్నాడీఎంకే పార్టీ వారు ఎక్కువగా అభిమానిస్తారు అని చెబుతారు. తమిళనాడులో 2026లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో విజయ్ ఫ్యాన్స్ వైపు నుంచి ఈ రకమైన కామెంట్స్ వస్తున్నాయి. ఇక ఏపీలో చూస్తే 2024 ఎన్నికలకు ముందు మెగాస్టార్ కి పద్మ విభూషణ్ అవార్డు దక్కింది. ఆయన ఈ అవార్డుకు అన్ని విధాలుగా అర్హుడే అయినా బీజేపీ పెద్దలు ఆయనకు తమ వైపు తిప్పుకోవాలని చాలా కాలంగా ప్రయత్నిస్తున్నారు అని ప్రచారంలో ఉంది. ఇపుడు బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు దక్కింది. ఆయనకు అవార్డు దక్కడం పట్ల అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బాలక్రిష్ణ నివాసానికి స్వయంగా వెళ్ళి ఆయనకు అత్యున్నత పౌర పురస్కారం దక్కినందుకు అభినందించారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొంతసేపు మాట్లాడుకున్నారు. మరో వైపు మెగాస్టార్ చిరంజీవితోనూ కిషన్ రెడ్డి మంచి సాన్నిహిత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇపుడు బాలయ్యతోనూ ఆయన భేటీ వేశారు. దీంతో సినీ తారలతో కమల విలాసానికి కొత్త ఆలోచనలు చేస్తున్నారా అన్న చర్చ అయితే సాగుతోంది.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : రాష్ట్ర బీకేఎంయు అధ్యక్షుడు కాంతయ్య



శామీర్ పేట, (గరుడ వార్త) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేర్చాలని రాష్ట్ర బీకేఎంయు అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు తప్పెట్ల రాములు గౌడ్ అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర బీకేఎంయు అధ్యక్షుడు కలకొండ కాంతయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో కాలయాపన చేస్తుందని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు కోసం గ్రామ సభలు పెట్టి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసాలు తీసుకొని గ్రామ సభలు పెట్టి అర్హులైన వారిని ఎంపిక చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వము సంవత్సరం దాటిన పేదలకు దక్కాల్సిన సంక్షేమ పథకాలు ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. లబ్ధిదారుల ఎంపిక లో అవకతవకలు జరగకుండా ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామీణ పేదలకు రావాల్సిన సంక్షేమ పథకాలు, పెన్షన్లు, మహిళలకు రూ. 2500 రూపాయలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పకడ్బందీగా అమలు చేయాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలన్నారు. రోజుకు రూ. 600 చొప్పున ఇవ్వాలని, పనులు చేసిన చోట మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. వ్యవసాయ కార్మికులకు రూ. 12 వేల ఎలాంటి శరతులు లేకుండా గ్రామ సభలలో లబ్ధిదారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపిటిసి తోటపల్లి శంకర్, జిల్లా బికేఎంయు ఉపాధ్యక్షులు కాసోజి మహాలక్ష్మి, బండ్ల నరేంద్ర చారి, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్, బి కే యు జిల్లా నాయకులు షేక్ అజిత్, కే జయమ్మ, జి నర్సమ్మ, కే నర్సమ్మ. బొందయ్య. నీలిమ. కేశవరం గ్రామస్తులు బొమ్మలపల్లి వెంకటేష్, బొమ్మలపల్లి శ్రీశైలం. విశాల్ తదితరులు పాల్గొన్నారు.

# క్యూబాను టెర్రరిస్ట్ రహిత దేశంగా గుర్తించాలి : రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కే.వి.ఎల్








శామీర్ పేట, జనవరి 28(గరుడ వార్త) : క్యూబాను టెర్రరిస్ట్ రహిత దేశంగా గుర్తించాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కమిటీ సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవిఎల్ డిమాండ్ చేశారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి- విద్యార్థుల పాత్ర అనే అంశంపై జిల్లా కార్యదర్శి డి. జి. నరేంద్ర ప్రసాద్ అధ్యక్షతన మండల కేంద్రం శామీర్ పేట ఎస్ పి ఆర్ కళాశాలలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కమిటీ సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవిఎల్ విచ్చేశారు. ఈ సందర్భంగా కేవిఎల్ మాట్లాడుతూ ప్రపంచంలో ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం జరుగుతుందని, మరొకవైపు పాలస్తీనా పై ఇజ్రాయిల్ ఏకపక్ష దాడి జరుగుతున్న సందర్భంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ క్యూబా దేశంపై విధించిన ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. క్యూబా దేశాన్ని టెర్రరిస్ట్ దేశాల జాబితా నుండి తొలగించాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ స్థాయిలో పోరాటం చేస్తున్నదని తెలిపారు. గత అమెరికా ప్రెసిడెంట్, బైడెన్ క్యూబాను టెర్రరిస్ట్ దేశాల జాబితా నుంచి తొలగించినప్పటికీ, దురుద్దేశపూర్వకంగా ట్రంప్ మళ్లీ క్యూబాకు వ్యతిరేకంగా ఈ చర్యలను తీసుకోవటాని అఖిల భారత శాంతి సంఘీ భావ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ప్రపంచంలో యుద్ధం, తీవ్ర వాదం, టెర్రరిజం, హింసవాదం, మతోన్మాదం, ఆయుధ పోటీ, చాలా ప్రమాదకరమని చెప్పారు. యుద్ధాల వలన వేలాదిమంది ప్రాణాలను కోల్పోతున్నారని, ఆస్తి నష్టం అవుతుందని తెలిపారు. ప్రకృతి సంపదలకు, పాఠశాలలకు, కళాశాలకు, వైద్యశాలలకు, కర్మాగారాలకు, యుద్ధాల వల్ల దెబ్బ తగలడమే కాకుండా ప్రపంచ నాగరికత సంస్కృతులు దాడికి గురవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. వీటికి వ్యతిరేకంగా శాంతి సంఘీభావ సంఘం జాతీయ కమిటీ పిలుపుమేరకు జాతీయ స్థాయిలో పోరాటాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రపంచంలోని విద్యార్థుల మౌలిక సమస్యలపై స్వాతంత్రం స్వేచ్ఛ సాధనలపై వివిధ రూపాలలో విద్యార్థులు చేసిన పోరాటాలు వీరోచిత మైనవని, స్ఫూర్తిదాయకంగా ఆదర్శంగా నిలుస్తాయనన్నారు. ప్రపంచం లో విద్యార్థుల పోరాటాలు చేయని సంఘటనలు లేవని, విద్యార్థుల పోరాటాల తోటే మార్పు సంభ విస్తుందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచ శాంతి సాధనకు విద్యార్థులు రాజకీయాలకు అతీతంగా సమైక్య పోరాటాల నిర్వహించడానికి ముందుకు రావాలని, శాంతి ఉద్యమంలో సభ్యులుగా చేరి ఐప్సో బలోపేతానికి కృషి చేయాల్సిన పరిస్థితు లు ఏర్పడ్డాయని ఆయన తెలిపారు. అనంతరం మేడ్చల్ జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ప్రపంచ శాంతి సంఘీభావ సంఘానికి అనుబం ధంగా ఉందని, ఈ సంఘం సమాజంలో శాంతి స్థాపనకు కృషి చేస్తుందన్నారు. మానవ హక్కులను కాపాడుకోవాలని విద్యార్థుల చరిత్ర గొప్పదని శాంతి ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఐప్సో మేడ్చల్ జిల్లా కార్యదర్శి డి.జీ.నరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు శాంతియుతమైన పరిస్థితులు ఉండాలని, విద్యార్థుల మధ్య స్నేహభావం, సమన్వయం ఉండాలని, మత్తు తదితర వ్యసనాల కు దూరంగా ఉండాలన్నారు. ఈ జిల్లాలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం బలమైన శక్తిగా ఎదగటానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి పోలగాని రవి కిషోర్ మాట్లాడుతూ ఏఐపీఎస్ఓ జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై పోరాడిందన్నారు. మణిపూర్ సంఘటనలు మళ్లీ పునరావృతం కాకూడదని, దేశంలో అశాంతి పరిస్థితిలు ఉండకూడదని తెలిపారు. ముందుగా మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీఎల్ రచించిన శాంతి ఉద్యమ పుస్తకాలను విద్యార్థులకు బహుమతులుగా అందజేశారు. కే వి ఎల్ ఇచ్చిన స్పీచ్ కు స్పందిస్తూ వెంటనే విద్యార్థులు అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం లో సభ్యులుగా చేరారు. శాంతి ఉద్యమ బలోపేతం కొరకు కృషి చేస్తామని శపథం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, కళాశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అభివృద్ధి కొరకు వీరారెడ్డి సేవలు మరువలేనివి

### రక్తదానం చేసిన అభిమానులు







శామీర్ పేట, (గరుడ వార్త) : అభివృద్ధి కొరకు కామిడి వీరారెడ్డి సేవలు మరువలేనివని పలువురు నాయకులు కొనియాడారు. కామిడి వీరారెడ్డి 22వ వర్ధంతి సందర్భంగా కామిడి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఎస్ఎల్ఎంఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలం కేశవరంలోని శ్రీ బాలాజి వేంకటేశ్వరస్వామి కళాశాల 24 వ వార్షికోత్సవంలో మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున పాల్గొన్నారు. విద్యార్థులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. వీరారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర తొలి దశ ఉద్యమకారుడు, మేడ్చల్ సమితి ప్రెసిడెంట్ కామిడి వీరారెడ్డిపై సిద్దగోని సుదర్శన్ రచించిన పుస్తకాన్ని ఎంపీ ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, ప్రిన్సిపల్ రవి, మూడు చింతలపల్లి మాజీ సర్పంచ్ జాం రవి, మాజీ ఎంపీటీసీ నాగరాజ్, వైద్యులు సర్వ రాజ్ ఖాన్, దివ్య రెడ్డి, వేణుగోపాల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం





వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కీసర మండలం బండ్లగూడ కు చెందిన సందని హరికృష్ణ వారి కుటుంబ సభ్యులు, అలాగే ఆలయం తరపున గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# భక్తిశ్రద్ధలతో ఘనంగా మాస శివరాత్రి పూజలు

శామీర్ పేట, (గరుడ వార్త) : భక్తిశ్రద్ధలతో ఘనంగా మాస శివరాత్రి పూజలను నిర్వహించారు. సోమవారం రాత్రి మండల కేంద్రం శామీర్ పేట శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో (శివాలయం)





ఆలయ ప్రధాన అర్చకులు గడియారం మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రుద్రాభిషేకం, అర్చన, హారతి, మంత్రపుష్పం నిర్వహించారు. శామీర్ పేటకు చెందిన భజన మండలి సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. భక్తుల సహకారంతో అన్నదానం చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# అనుసంధాన రహదారి.. అధ్వానంగా మారి!

కరీంనగర్ : నగరపాలక సంస్థ పరిధిలో ఏడాది కిందట ముఖ్యమంత్రి హామీ నిధులతో(సీఎంఏ) అట్టహాసంగా ప్రారంభించిన పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. గత ప్రభుత్వం రూ.132.94 కోట్లు కేటాయించడంతో నగరవ్యాప్తంగా రహదారులు, మురుగుకాలువలు, తాగునీటి పైపులైన్లు వేసేందుకు నిర్ణయించారు. అందులో ఒకటి కట్టరాంపూర్-కోతిరాంపూర్ అనుసంధాన రోడ్డు. ఆ పనులు కూడా మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోతుందని, ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించాలని కోరుతున్నారు.

**రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు**

కట్టరాంపూర్ నుంచి కోతిరాంపూర్‌కు వెళ్లు దారి రెండు కిలోమీటర్లు ఉంటుండగా అందులో ఒక కిలోమీటర్ మేర సీసీ రోడ్డు వేశారు. రెండువైపులా డ్రైనేజీ నిర్మించాల్సి ఉంది. అక్కడి వరకే తాగునీటి పైపులైను వేశారు.

వదిలేసిన రహదారి గుంతలు పడి దారుణంగా మారింది. అటుగా రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగుకాలువలు అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు రహదారులపై ప్రవహిస్తోంది. ఇటీవల మురుగంతా రోడ్డుపై వరదలా ప్రవహించింది. తాగునీటి పైపులైను ఎక్కడ పడితే అక్కడ పగిలింది. నల్లా నీరు వస్తే చాలు రోడ్డుపై లెక్కలేనన్నీ లీకేజీలు ఉంటున్నాయి.

నిధులిస్తే ప్రారంభం

సీఎంఏ నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తే పనులు ప్రారంభమవుతాయి. నగరవ్యాప్తంగా ఇలాంటి అసంపూర్తి పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చే నెల పనులు ప్రారంభించే అవకాశముంది.

వై.సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

# ఊళ్లకు ఊళ్లు.. సౌరకాంతులు..!

కొత్తగూడెం: సౌర విద్యుదుత్పత్తికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. మధిర నియోజకవర్గం బోనకల్లు మండలంలోని 22 పల్లెలతో పాటు ఖమ్మం, వైరా, అశ్వారావుపేట, పాలేరు నియోజకవర్గాల్లోని మరో నాలుగు ఊళ్లను ఆదర్శ సౌర గ్రామాలుగా తీర్చిదిద్దనున్నాయి. ఇప్పటి వరకు ఏదైనా ఇల్లు లేదా ప్రాజెక్టుకు పరిమితమైన సౌర విద్యుత్తు కాంతులను పల్లెలకు విస్తరించాలని కేంద్రం భావిస్తోంది. మొదట జిల్లాకొక గ్రామాన్ని ఎంపికచేసి అక్కడి ప్రతి ఇల్లు, కార్యాలయం, వ్యవసాయ బోర్లు సహా ఊరికి అవసరమైన అన్ని వనరులకూ సౌర విద్యుత్తు సదుపాయం కల్పించాలని రాష్ట్రాలకు సూచించింది. తొలుత ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని సిరిపురం గ్రామాన్ని అధికారులు ఎంపిక చేసి సర్వే జరిపారు. ఈ పథకాన్ని మరిన్ని గ్రామాలకు విస్తరించాలనే ఉద్దేశంతో బోనకల్లు మండలంతో పాటు మరో నాలుగు గ్రామాలను ఎంపిక చేశారు.

**రెండు విధాలుగా లాభదాయకమే..**

గ్రామాల్లో పూర్తిస్థాయిలో సోలార్ విద్యుదుత్పత్తి వల్ల రెండు విధాలుగా లాభదాయకమని అధికారులు వివరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును సరఫరా చేస్తూ.. వాటి తాలూకూ బిల్లులను డిస్కంలకు చెల్లిస్తుంది. ఆ విద్యుత్తును కొనటానికి యూనిట్‌కు రూ.5చొప్పున డిస్కంలు చెల్లిస్తున్నాయి. అంటే 200 యూనిట్లకు రూ.1,000 వెచ్చిస్తున్నాయి. అలా కాకుండా ఒక్కో ఇంటిపై రెండు కిలోవాట్ల సోలార్ ప్యానెళ్లు అమర్చితే నెలకు 400 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. గృహ అవసరాలకు 200 యూనిట్లు పోగా మరో 200 యూనిట్లను డిస్కంలకు అమ్ముకోవచ్చు. డిస్కంలకు కూడా కేవలం రూ.3.13కే యూనిట్ విద్యుత్తు దొరుకుతుంది. ఈ పథకం ద్వారా తొలుత ప్రభుత్వానికి పెట్టుబడి భారమైనా భవిష్యత్తులో విద్యుత్తు కొనుగోలు, ఉత్పత్తి తగ్గించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

**పీఎం సూర్యఘర్ యోజనలో భాగంగా..**

దేశవ్యాప్తంగా కోటి ఇళ్లపై సౌర విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటుచేయాలనే లక్ష్యంతో 'ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన'ను కేంద్రం అమలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆదర్శ సౌర గ్రామం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గ్రామంలోని గృహ విద్యుత్తు కనెక్షన్లతో పాటు వ్యవసాయ బోర్లకూ సోలార్ ప్యానెళ్లు అమర్చుతారు.

ప్రభుత్వ కార్యాలయాలు, వీధి దీపాలు, గ్రామం మొత్తానికి సంయుక్తంగా వినియోగించే విద్యుత్తును ఈ పథకం ద్వారా అందించాలి.

**అమలు విధానం..**

ఆదర్శ సౌర గ్రామంగా ఎంపికైన పల్లెలను విద్యుత్తు, టీజీ రెడ్కో అధికారులు సర్వే చేస్తారు. గృహ, వ్యవసాయ మోటారు కనెక్షన్ల లెక్కలు తీస్తారు.గృహాలకైతే రెండు కిలోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే రూ.2.20లక్షల సోలార్ ప్యానెళ్లు, వ్యవసాయానికైతే 5కిలోవాట్లు ఉత్పత్తి చేసే రూ.3.50లక్షల ప్యానెళ్లను ఉచితంగా అమర్చుతారు.మిగులు విద్యుత్తును డిస్కంలకు విక్రయించే సౌకర్యాన్ని కల్పిస్తారు. ఒక్కో యూనిట్‌కు రూ.3.13 చొప్పున డిస్కంలు చెల్లిస్తాయి.ఆదర్శ సౌర గ్రామంగా ఎంపిక చేసిన వాటిల్లో సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే మధిర నియోజకవర్గంలోని సిరిపురంలో 1,024 గృహ, 500 వ్యవసాయ కనెక్షన్లను గుర్తించాం. మరో వారం రోజుల్లో మిగతా గ్రామాల్లో సర్వే పూర్తిచేస్తాం. అజయ్‌కుమార్, రెడ్కో అధికారి, ఖమ్మం

# ఉన్నతి లేక.. ఉపాధి లభించక..

పెద్దశంకరంపేట : ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని యువతకు 'ఉన్నతి' కార్యక్రమం ద్వారా ఉచిత నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాల్సి ఉంది. కానీ అధికారుల ప్రోత్సాహం లేకపోవడంతో పాటు గ్రామీణ యువత ముందుకు రాకపోవడంతో ఈ పథకం నీరుగారిపోతోంది. 2018–19లో మాత్రమే యువతకు శిక్షణ అందించి వదిలేశారు. అప్పటి నుంచి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. దీంతో జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువత నిరాశకు గురవుతున్నారు.

**90 రోజుల ఉచిత శిక్షణ**

ఉన్నతి కార్యక్రమం ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుంది. 90 రోజుల శిక్షణలో భాగంగా ఉచిత భోజనం, వసతితో పాటు రోజుకు రూ.300 చొప్పున ఉపకార వేతనం ఇస్తారు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉండి, వంద రోజుల పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని వివాహం కాని నిరుద్యోగ యువతకు వివిధ రంగాల్లో



నైపుణ్య శిక్షణ అందిస్తారు.

**అవగాహన కరవై...**

జిల్లా వ్యాప్తంగా 1.64 లక్ష మందికి జాబ్ కార్డులు ఉండగా, 3.32 లక్షల మంది కూలీలు ఉన్నారు. 2018–19లో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని యువతకు మాత్రమే నైపుణ్య శిక్షణ అందించారు. ఆ తర్వాత వదిలేశారు. కరోనా ప్రభావంతో ఈ కార్యక్రమం నిర్వహణను పట్టించుకోలేదు. అనంతరం ప్రజలకు మండలాల ఏపీఎంలు అవగాహన కల్పించడంలో శ్రద్ధ చూపకపోవడంతో నిరుద్యోగులు ముందుకు రాకుండా పోయారు. ఇటీవల చిన్నశంకరంపేట మండలంలో సెర్ప్ అధికారులు ఉన్నతి కార్యక్రమం కింద 59 మందిని గుర్తించి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హార్టికల్చర్, సేంద్రియ ఎరువులు వంటి వాటిపై శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అన్ని మండలాల వారికి ప్రాధాన్యం కల్పించాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

**బృందాన్ని ఎంపిక చేశాం: ప్రకాశ్ డీపీఎం**

ఉన్నతి కార్యక్రమంలో భాగంగా చిన్నశంకరంపేట మండలంలో 59 మందితో కూడిన ఒక బ్యాచ్‌ను ఎంపిక చేశాం. త్వరలో వీరికి వ్యవసాయం, అనుబంధ రంగాలపై శిక్షణ ఇస్తాం. 'ఉన్నతి' కార్యక్రమం కొనసాగుతోంది. గ్రామీణ యువత ముందుకు వస్తే శిక్షణ ఇప్పించడానికి అవకాశం ఏర్పడుతుంది.

# ముగిసిన సభలు.. ఆన్‌లైన్ మొదలు



పెద్దపల్లి : రైతు భరోసా, రేషన్‌కార్డు, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో అధికార యంత్రాంగం వేగం పెంచింది. జాబితా రూపొందించే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ నెల 16 నుంచి 20 వరకు అధికారిక బృందాలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాయి. జాబితాలో పేర్లున్న వారు అర్హులా! కాదా! అన్న విషయాన్ని ఆరా తీశాయి. 21 నుంచి 23 వరకు నిర్వహించిన గ్రామ సభల్లో జాబితాను ప్రజల ముందుంచారు. ఈ సందర్భంగా అధికారుల దృష్టికి వచ్చిన విషయాల ఆధారంగా అనర్హులను తొలగించగా శుక్రవారం మండల కేంద్రాల్లో వివరాలు ఆన్‌లైన్ చేసే ప్రక్రియ మొదలైంది. నాటికి తుది జాబితా సిద్ధం చేయనున్నారు.

**మండలాల వారీగా వివరాలు నిక్షిప్తం**

ప్రజాపాలన, సామాజిక ఆర్థిక సర్వే కార్యక్రమాల ద్వారా దరఖాస్తుదారులకు సంబంధించి 360 డిగ్రీల వడబోత చేపట్టారు. అనంతరం అర్హుల జాబితాను జిల్లాలకు పంపించారు. ఆ తర్వాత సర్వే అధికారులు ఇంటింటికీ తిరిగి సొంతిల్లు, భూమి, ఇతర ఆస్తులపై ఆరా తీశారు. జిల్లావ్యాప్తంగా రేషన్‌కార్డులకు 15,255 మందితో జాబితా రూపొందించగా గ్రామసభల అనంతరం ఇందులో అర్హుల వివరాలను మండల పరిషత్ కార్యాలయాల్లో ఆన్‌లైన్ చేస్తున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి 15,046 మంది ఉండగా గ్రామసభల్లో అనర్హులను గుర్తించారు. మరోసారి పరిశీలిస్తున్నారు. భూమి కలిగి ఉండటం, ఉపాధిహామీలో నిర్ణీత పని దినాలు లేని వారిని జాబితా నుంచి తొలగిస్తున్నారు.

**దరఖాస్తులపై స్పష్టత కరవు**గ్రామసభల్లో స్వీకరించిన దరఖాస్తులపై స్పష్టత కరవైంది. ప్రభుత్వం అందించిన జాబితాలో అనర్హులను తొలగించి, మిగిలిన వారిని ఆన్‌లైన్ చేస్తున్నారు. జిల్లాలో రేషన్‌కార్డులకు 23,012, ఆత్మీయ భరోసాకు 6,584, ఇందిరమ్మ ఇళ్ల కోసం 19,950 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిస్థితిపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. రేషన్ కార్డుల జారీ పక్రియ నిరంతరమని ప్రకటించినప్పటికీ గతానుభవాల దృష్ట్యా ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ముందుగా గ్రామసభల్లో ఆమోదం పొందిన వారికి పథకాలు వర్తింపజేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే దరఖాస్తులపై సర్వే చేస్తామని పేర్కొంటున్నారు.

**2,677 ఎకరాల తొలగింపు**

రైతుభరోసా పథకానికి సంబంధించి వ్యవసాయ, రెవెన్యూ ఇతర శాఖల అధికారుల సంయుక్త సర్వేలో సాగు యోగ్యంగా లేని భూములను గుర్తించారు. రాళ్లు, వెంచర్లు, చేపల చెరువులు, క్రషర్లు, సినిమా హాళ్లు, రైసుమిల్లుల స్థలాలను జాబితా నుంచి తొలగించారు. గ్రామసభల ఆమోదంతో జిల్లావ్యాప్తంగా 2,677 ఎకరాలను రైతు భరోసా పోర్టల్ నుంచి తొలగించడానికి ఆన్‌లైన్ చేస్తున్నారు. పెద్దపల్లిలో 906 ఎకరాలు, సుల్తానాబాద్‌లో 296, మంథనిలో 263, ధర్మారంలో 233, రామగుండంలో 191 ఎకరాలను తొలగించారు. జిల్లాలో అత్యధికంగా పెద్దపల్లిలో 906, అత్యల్పంగా ముత్తారంలో 14 ఎకరాలు మాత్రమే పథకం నుంచి తీసివేశారు.

# దశాబ్దాల కళాశాల.. ఉన్నతీకరణ కలే!




సిరిసిల్ల : 'పాతబడిన భవనాలు.. ఎగిరిపోయి, కూలడానికి సిద్ధంగా ఉన్న రేకుల కప్పులు.. వాటిలో పాతకాలం నాటి యంత్రాలు.. కనిపించని కనీస వసతులు. ఇవీ జిల్లాలో అయిదు దశాబ్దాల క్రితం నిర్మించిన పాలిటెక్నిక్ కళాశాల దుస్థితి'. విద్యార్థులకు పలు కోర్సుల్లో సాంకేతిక విద్యనందించి ఉపాధి కల్పించడానికి ఉద్దేశించిన పాలిటెక్నిక్ కళాశాల మారుతున్న కాలానికి అనుగుణంగా లేదు. రాష్ట్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్‌లను ఇంజినీరింగ్ కళాశాలలుగా ఉన్నతీకరించే (అప్‌గ్రేడ్) ప్రణాళికలు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో జేఎన్‌టీయూ కళాశాల ఉండటంతో సాంకేతిక విద్యాశాఖ ఆలోచనలో పడినట్లు సమాచారం. మరోవైపు పాలిటెక్నిక్‌లో అదనపు కోర్సులకు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈలోపు పాత భవనానికి మరమ్మతులు చేయడంతో పాటు కొత్త భవనం అందుబాటులోకి వస్తేనే అనుమతులు లభించే అవకాశం ఉంది. జిల్లాలో వేములవాడ మండలం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, టెక్స్‌టైల్‌తోపాటు సీసీపీ కోర్సులు ఉన్నాయి. సీసీపీ, టెక్స్‌టైల్ మినహా మిగతా కోర్సుల్లో ప్రతి విద్యాసంవత్సరం ప్రవేశాలు పూర్తిస్థాయిలో జరుగుతున్నాయి. మూడేళ్లకుగాను 1,260 మంది విద్యార్థులు ఆయా కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్నారు. టెక్స్‌టైల్‌కు అనుబంధంగా ఫ్యాషన్ టెక్నాలజీని తీసుకొచ్చేందుకు గతేడాది సాంకేతిక విద్యాశాఖకు దస్త్రాన్ని పంపారు. దీనికి ఏఐటీసీ నిబంధనల ప్రకారం పాఠ్యాంశాల ప్రణాళిక ఉండాలి. వీటికి అనుమతులకు వెళ్లే సమయానికి విద్యాసంవత్సరం ప్రారంభమైంది. వచ్చే విద్యాసంవత్సరానికి ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సును ప్రారంభించేలా అన్ని ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. కాగా సీసీపీ కోర్సులోనూ ప్రవేశాలు తగ్గడంతో దాని స్థానంలో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సును ప్రవేశపెట్టాలని ప్రతిపాదనలు చేస్తున్నారు. ఈ రెండు కోర్సులపై ఇప్పటికే రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖకు కళాశాల నుంచి ప్రతిపాదనలు పంపారు. ఈ రెండు కోర్సులు ఆమోదం పొందాలంటే భవనం తప్పనిసరి.

**మరమ్మతుల ఊసేలేదు**కళాశాల 1979లో ప్రారంభమైనప్పటికీ సొంత భవనాల నిర్మాణం 1982లో పూర్తయ్యాయి. వర్షాలకు పరిపాలన భవనం ఉరుస్తుండట ంతో రూ.30 లక్షలతో గతేడాది పైకప్పును మరమ్మతులు చేశారు. తరగతుల గోడల్లో చెట్లు మొలవడంతో పగుళ్లు బారుతున్నాయి. నీరు, విద్యుత్తు సరఫరా వ్యవస్థ చాలా వరకు దెబ్బతిన్నది. గదులు సరిపోకపోవడంతో సివిల్, ఎలక్ట్రికల్ విభాగాల తరగతులు రెండు షిఫ్టులుగా జరుగుతున్నాయి. నాలుగేళ్లలో మరమ్మతులు, నూతన భవన నిర్మాణానికి మూడుసార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. గత ప్రభుత్వ హయాంలో సీఎస్‌ఆర్ నిధులతో బాగుచేసేందుకు పరిశీలించారు. ప్రస్తుతం మరోసారి రూ.20 కోట్లతో పాత వాటికి మరమ్మతులు, కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. **విద్యార్థులకు ఇబ్బంది లేదు**

పాత భవనం కావడంతో శిథిలావస్థకు చేరుకుంది. విద్యార్థుల తరగతులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. అదనపు భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. భవిష్యత్తులో ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త కోర్సులకు ప్రణాళికలు చేశాం. వీటిపై సాంకేతిక విద్యాశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉంది.ప్రభాకరాచారి, ప్రిన్సిపల్, పాలిటెక్నిక్ కళాశాల

# పైవంతెన నిర్మాణంలో రెండేళ్లుగా నిర్లక్ష్యం



కోనరావుపేట : గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా వ్యవస్థ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పెంటివాగుపై చేపట్టిన పైవంతెన నిర్మాణ పనులు రెండేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. రెండు అడుగులు ముందుకు... మూడు అడుగులు వెనక్కి అన్న చందంగా మారాయి. గుత్తేదారు స్లాబ్ వరకు పనులు చేపట్టి ఆపేశారు. సకాలంలో పూర్తి చేయకపోతే వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోయి మళ్లీ తిప్పలు తప్పవు.కోనరావుపేట మండలం కొండాపూర్–వెంకట్రావుపేట గ్రామాల మధ్య పెంటివాగు మూడేళ్ల క్రితం భారీగా కురిసిన వర్షాల కారణంగా వరద తాకిడికి కాజ్‌వే పైపులైను పూర్తిగా కోతకు గురైంది.ప్రభుత్వం సమస్య శాశ్వత పరిష్కారానికి మూడేళ్ల క్రితం పంచాయతీరాజ్‌శాఖ నిధులు రూ.5 కోట్లు మంజూరు చేసింది.పనులకు సంబంధించి టెండరు ప్రక్రియను పూర్తి చేసి గుత్తేదారును ఖరారు చేశారు. ఈలోగా వర్షాకాలం ప్రారంభం కావడంతో పనుల ప్రారంభంలో జాప్యం నెలకొంది.గత ఏడాది గుత్తేదారు పనులు చేపట్టగా వంతెన నిర్మాణానికి పిల్లర్లు వేశారు. ఈ ఏడాది వర్షాకాలం ముగిసే సమయానికి స్లాబ్ వరకు పనులు చేసి నిలిపివేశారు.

మరో అయిదారు నెలల్లో వర్షాకాలం ప్రారంభం కానుండటంతో వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిస్తే వాహనదారులు, రైతుల రాకపోకలకు అంతరాయం ఏర్పడనున్నది.

సకాలంలో పూర్తికి చర్యలు

పైవంతెన పనులకు సంబంధించిన రికార్డులు చేసి ప్రభుత్వానికి పంపించాం. గుత్తేదారు జిల్లాలో పలు చోట్ల పనులు చేస్తుండటంతో బిల్లులు పెద్ద మొత్తంలో బకాయి ఉన్నాయి. దీంతో పనుల్లో కొంత జాప్యం నెలకొంది. త్వరగా పనులు చేపట్టాలని గుత్తేదారుకు ఆదేశాలు జారీ చేశాం. సకాలంలో పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకొంటాం.

పవనకుమారి డీఈ, పీఆర్, చందుర్తి

వేసవిలోగా నిర్మించాలి

నిమ్మపల్లి, కొండాపూర్, వెంకట్రావుపేట, బావుసాయిపేట తదితర గ్రామాల వాహనదారులు, రైతులు నందికమాన్ వరకు తారు రోడ్డు ఉండటంతో ఈ మార్గంలో వస్తుంటారు. సిరిసిల్ల – మరిమడ్ల రెండు వరుసల తారు రోడ్డులో మరోచోట పెంటివాగు వద్ద లోలెవల్ కల్వర్టు తరచూ కోతకు గురై రాకపోకలు నిలిచిపోతున్నాయి. పైవంతెన నిర్మాణం పూర్తయితే వరద వచ్చినా రాకపోకలకు ఇబ్బంది ఉండదు. అధికారులు, పాలకులు స్పందించి వేసవిలోగా పైవంతెన పూర్తికి చర్యలు తీసుకోవాలి.అనుముల బాల్‌రెడ్డి, వాహనదారుడు, నిమ్మపల్లి

# ఇక పురాల్లో ప్రత్యేకాధికారుల పాలన?

చెన్నూరు : పురపాలకాల పాలకవర్గాల గడువు కూడా ఈనెల 26తో ముగియనుండగా ప్రత్యేక పాలన కోసం అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తలమునకలై ఉన్న అధికారులకు బాధ్యతలు అప్పగించేందుకు కసరత్తు చేస్తోంది.

**పాతవి మూడు.. కొత్తవి నాలుగు**

జిల్లాలో తొలుత మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి పురపాలికలు ఉండేవి. 2018లో మేజర్ గ్రామపంచాయతీలు, కొన్ని పెద్ద పంచాయతీలకు సమీప గ్రామాలను కలుపుకొని నాలుగు కొత్త మున్సిపాలిటీలను ప్రకటిస్తూ జీవో విడుదల చేసింది. మేజర్ పంచాయతీలైన చెన్నూరు, లక్షెట్టిపేట, నస్పూరు, క్యాతనపల్లి నూతన పురపాలికలుగా రూపాంతరం చెందాయి. కొత్తవాటితో కలిపి మొత్తం జిల్లాలో 7 పురపాలక సంఘాలు ఏర్పడ్డాయి. ఏజెన్సీ ప్రాంతమైన మందమర్రిలో పాలకవర్గ ఎన్నికలు జరగకపోగా మిగతా ఆరు పురపాలక సంఘాల్లో 2020 జనవరిలో ఎన్నికలు నిర్వహించగా జనవరి 27న పాలకమండళ్లు కొలువుదీరాయి. 2025 జనవరి 26తో జిల్లాలోని ఏడు పురపాలకవర్గాల గడువు ముగియనుంది.



**ఆశించిన మేర అభివృద్ధి జరగలేదు**

గత మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు భారాసకే దక్కాయి. అయినప్పటికీ ఐదేళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ప్రగతి జరగలేదు. 2020లో కొవిడ్ కారణంగా పాలన సాఫీగా సాగలేదు. 2021 సెప్టెంబరు తరువాత పలు అభివృద్ధి పనులకు స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వీటితో సమీకృత భవనాలు, అంతర్గత రహదారులు, పట్టణాల్లో విభాగినులు అంటూ హడావుడి చేసినా.. వాటికి పూర్తి స్థాయిలో నిధులు రాలేదు. ఫలితంగా ఎక్కడా వీటిని పూర్తిగా చేసిన దాఖలాలు లేవు. పాత మున్సిపాలిటీలు కొంత ఫరవాలేకున్నా కొత్త పురపాలికలు మాత్రం ఆశించిన మేర పన్నులు రాబట్టుకోలేక నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి.

**పాత, కొత్త కలయికతో కార్పొరేషన్‌గా ..**

జిల్లాలోని పాత పురపాలక సంఘమైన మంచిర్యాల, కొత్తగా ఏర్పాటైన నస్పూరు మున్సిపాలిటీని కలుపుకొని మంచిర్యాలను కార్పొరేషన్‌గా ప్రకటిస్తూ ప్రభుత్వం ఇటీవలే గెజిట్ విడుదల చేసింది. నస్పూరు పురపాలికతో పాటు హాజీపూర్ మండలంలోని మరో ఆరు గ్రామాలను కలుపుకొని దీన్ని ఏర్పాటు చేస్తున్నారు. తొలుత పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తు సభ్యుల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే పుర ఎన్నికలకు మరో ఆరు నెలలు పట్టే అవకాశముందని పలువురు పేర్కొంటున్నారు.

# వైద్యులు కొరవడి.. సేవలు మొక్కుబడి

కాగజ్‌నగర్ : వాతావరణ కాలుష్యం, ఆహార పదార్థాల కల్తీ వెరసి జనం పలు రోగాలబారిన పడుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతరత్రా అనారోగ్య సమస్యలకు మంచి ఫలితాలు కనిసిస్తుండగా హోమియో వైద్యానికి ఆదరణ పెరిగింది. ఈ వైద్య సేవలకు ఎక్కువ సంఖ్యలో జనం ఆసక్తి కనబరుస్తున్నా ప్రభుత్వం మాత్రం హోమియో వైద్యంపై పట్టనట్లు వ్యవహరిస్తుంది. జిల్లాలో హోమియో, యునానీ, ఆయుర్వేద వైద్యశాలల్లో నెలకొన్న సమస్యలపై కథనం.

జిల్లాలో రెగ్యులర్ కింద 8 ఆయూష్ ఆసుపత్రులుండగా ఆయుర్వేద 5, హోమియో 2, యునానీ 1 చొప్పున ఉన్నాయి. 8 మంది వైద్యులు ఉండాలి. బెజ్జూరు, గురుడుపేట, బీబ్రా వైద్యులు డిప్యూటేషన్‌పై పొరుగు జిల్లాలో పని చేస్తుండగా సిర్పూరు(టి), ఉషాగాం, కాగజ్‌నగర్ ఆసుపత్రుల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆశించిన స్థాయిలో వైద్య సేవలు అందని పరిస్థితి నెలకొంది. జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్(ఎన్‌ఆర్‌హెచ్‌ఎం) కింద హోమియోపతి 5, ఆయుర్వేద 3, యునానీ 1 చొప్పున ఆసుపత్రులున్నాయి. వీటిలో గిన్నెధరి ఆయుర్వేద ఆసుపత్రి వైద్యుడి పోస్టు ఖాళీగా ఉంది. ఎన్‌ఆర్‌హెచ్‌ఎం కింద పని చేస్తున్న కొంత డాక్టర్లను మూడు రోజులు రెగ్యులర్ స్థలంలో మరో మూడు రోజులు పొరుగు మండలాల్లో డిప్యూటేషన్‌పై పని చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో వైద్యులు అందుబాటులో లేక జనం ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు కాగజ్‌నగర్ మినహా ఎక్కడా సొంత భవనాలు లేవు.

**వైద్యుల అక్రమ డిప్యూటేషన్లు**

జిల్లాలో రెగ్యులర్ ఆయుర్వేద ఆసుపత్రులు అయిదు ఉండగా ఇందులో ముగ్గురు వైద్యులు పైరవీలతో డిప్యూటేషన్‌పై వరంగల్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ ఆసుపత్రుల పని తీరుపై పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ విషయంపై రీజినల్ డిప్యూటీ డైరెక్టర్(ఆర్‌డీడీ) ప్రమీలను సంప్రదించగా జిల్లాలోని బెజ్జూరు, గురుడుపేట, బీబ్రా రెగ్యులర్ వైద్యులు వరంగల్ జిల్లాలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న మాట వాస్తవమేనని తెలిపారు. సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

# పసిపిల్లల నెత్తిన ప్రమాదం

చేగుంట : అంగన్‌వాడీ కేంద్రాలకు చాలా చోట్ల సొంత భవనాలు లేక సమస్యలకు నిలయాలుగా మారాయి. ఉన్న భవనాలు కొన్ని శిథిలావస్థకు చేరాయి. దీంతో పలకాబలపం పట్టి అక్షరాలను దిద్దాల్సిన చిన్నారులు నిత్యం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు పెచ్చులు ఊడి నలుగురు చిన్నారులు గాయపడిన నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితిపై పరిశీలనాత్మక కథనం.నర్సాపూర్ పురపాలిక పరిధిలో 13 అంగన్వాడీ కేంద్రాలుండగా ఒకదానికి మాత్రమే సొంత భవనం ఉంది. 14వ వార్డులో ర్వహిస్తున్న కేంద్రం రేకులతో కూడిన ఇరుకైన గదిలో నిర్వహిస్తున్నారు.

చేగుంటలోని అంగన్‌వాడీ–3 కేంద్రం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయేలా ఉంది.

అల్లాదుర్గం మండలంలోని సీతానగర్ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం గోడలు బీటలు పడ్డాయి. కేంద్రానికి ముందు విద్యుత్తు నియంత్రిక, లోతైనా మురుగు కాలువ ఉంది. కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలోని భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోతున్నాయి. టేక్మాల్ మండలంలో 73 కేంద్రాలు ఉండగా 26కు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. కొన్ని చోట్ల పెంకుటిళ్లలో కొనసాగుతున్నాయి.

# మరో రెండేళ్లు ఇంతే.. తాగునీరు కొంతే

హైదరాబాద్: శరవేగంగా విస్తరిస్తున్న మహానగరంలో మరో రెండేళ్ల వరకూ ప్రస్తుతం సరఫరా అవుతున్న తాగునీటితోనే సర్దుకోవాల్సిన పరిస్థితి. గోదావరి రెండోదశలో నగరానికి నీరు అందేవరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న 550 ఎంజీడీలే వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్, కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా జలాలను గరిష్ఠ సామర్థ్యం మేరకు ఉపయోగించుకుంటుండగా.. ఇంతకుమించి తీసుకునే పరిస్థితి ఇప్పటికిప్పుడు లేదని అధికారులు పేర్కొంటున్నారు.



**ప్రస్తుత పరిస్థితి..** జలమండలి పరిధి ప్రస్తుతం 1,450 చదరపు కిలోమీటర్లు. జీహెచ్‌ఎంసీతోపాటు 18 మున్సిపాలిటీలు మరో 17 పంచాయతీలు, కోటి 20 లక్షలపైగా జనాభాకు జలమండలి నీటిని సరఫరా చేస్తోంది. ప్రస్తుతం రోజుకు 550 ఎంజీడీలు సరఫరా చేస్తోంది. తొమ్మిదేళ్లుగా నగరం విస్తరించినా.. జనాభా పెరిగినా అదనంగా రాకపోవడంతో సమస్య పెరిగింది. దీనికితోడు కొత్త ప్రాంతాలు జలమండలి పరిధిలోకి వస్తుండటంతో మరింత ఒత్తిడి పెరుగుతోంది.

**అనేక రకాలుగా వృథా..**

జలమండలి సరఫరా చేస్తున్న నీటికి కిలో లీటరు(వెయ్యి లీటర్లకు) రూ.48 అవుతోంది. నగరంలో నీటి వృథా అనేక రకాలుగా జరుగుతోంది. ఈ నీటిని వందశాతం తాగేందుకే ఉపయోగించాల్సి ఉన్నా.. ఇతర అవసరాలకూ వినియోగిస్తున్నారు. ప్రధానంగా గార్డెన్‌లు, ఇంటి పరిసరాలను, వాహనాలను శుభ్రం చేయడానికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.

# ఆన్‌లైన్ ఆట.. నేరాల బాట

హైదరాబాద్ : బుద్ధిగా చదివే విద్యార్థి గంజాయి స్మగ్లర్‌గా మారాడు. కార్పొరేట్ కంపెనీలో ఉన్నతస్థాయి ఉద్యోగి దొంగయ్యాడు. ప్రాంగణ ఎంపికలో ఐటీ కంపెనీలో కొలువు సాధించిన యువకుడు నేరాల బాట పట్టాడు. ఒక బ్యాంకు ఉద్యోగి ఖాతాదారుల సొమ్ము రూ.50 లక్షలు సొంత ఖాతాకు మళ్లించుకున్నాడు. ఎంతోమంది ఆన్‌లైన్ ఆటకు బానిసలై డబ్బు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. అప్పులపాలవుతున్నారు. 3 కమిషనరేట్ల పరిధిలో ఏటా రూ.10 కోట్ల మేర బాధితులు నష్టపోతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి.

**ఆన్‌లైన్ గేమింగ్ మోసాలిలా..**

ఆన్‌లైన్ గేమింగ్‌లో రెండు పద్ధతులు. 'స్కిల్ గేమ్', 'ఛాన్స్ గేమ్'. స్కిల్‌గేమ్‌కు దేశంలో అనుమతి ఉన్నప్పటికీ తెలంగాణలో నిషేధం. ఛాన్స్‌గేమ్ దేశం మొత్తం నిషేధం. స్కిల్ గేమ్‌లో మూడు ముక్కలాట, రమ్మీ ఉంటే ఛాన్స్ గేమ్‌లో ప్రిడిక్షన్ ఉంటాయి. ఆడేందుకు రూ.లక్ష డిపాజిట్ చేయాలి. తొలుత రూ.200, రూ.300, రూ.2-3 వేల వరకూ గెలిపిస్తూ లాభాల ఆశ చూపుతారు. ఆశతో రూ.5-10వేల వరకూ వెళ్లారంటే కేటుగాళ్ల చేతికి చిక్కినట్టే.

గుర్తింపు పొందినవారితో ప్రచారం

ఆన్‌లైన్ గేమింగ్/బెట్టింగ్‌ల్లో ఆనందం.. ఆదాయం సొంతం చేసుకోవచ్చంటూ నిర్వాహకులు సామాజిక మాధ్యమాల ద్వారా పిల్లలు, యువతను ఆకట్టుకుంటున్నారు. యూట్యూబ్, రీల్స్ ద్వారా గుర్తింపు పొందిన యువతకు కమీషన్ ఇచ్చి ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేయిస్తున్నారు. ఇదంతా నిజమని భావించిన శివారు ప్రాంతానికి చెందిన యువకుడు రూ.10 లక్షలు నష్టపోయి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

**అత్యాశకు పోతే కష్టార్జితం గల్లంతే**

చైనా కంపెనీలు గేమింగ్/బెట్టింగ్ యాప్‌లతో సొమ్మంతా కాజేస్తున్నాయి. క్రిప్టోగా మార్చి దుబాయ్, సింగపూర్, చైనా దేశాలకు హవాలారూపంలో చేరవేస్తున్నారు. బ్యాంకులు, యూపీఐ లావాదేవీలున్న ఫోన్ల పాస్‌వర్డ్, పిన్ నంబర్ గోప్యంగా ఉంచుకోవాలి. తేలిక మార్గంలో డబ్బు సంపాదించ వచ్చనే అత్యాశ వద్దు.

# ఉపకేంద్రాల నిర్మాణం మరింత ఆలస్యం

హైదరాబాద్: నగరంలో విద్యుత్తు ఉపకేంద్రాల నిర్మాణానికి గుత్తేదార్లు ముందుకురావడం లేదు. నిబంధనల్లో మార్పులతో జోన్ పరిధిలో సింగిల్ టెండర్లకు పెద్ద సంస్థల నుంచి స్పందన కరువైంది. చిన్న సంస్థలేమో అర్హత లేక దూరంగా ఉన్నాయి. నిబంధనల ప్రకారం రెండుసార్లే టెండర్ల గడువు పొడించే అధికారం ఉంది. ఈ గడువు శుక్రవారంతో ముగిసినా ఒక్క టెండర్ కూడా దాఖలు కాలేదు. దీంతో తదుపరి ఏం చేయాలనే దానిపై టీజీఎస్పీడీసీఎల్ మాస్టర్‌ప్లాన్ విభాగం కార్పొరేట్ కార్యాలయానికి లేఖ రాసింది. టెండర్ల ప్రక్రియ పూర్తికాకపోవడంతో వేగంగా పూర్తిచేయాలనుకున్న 88 ఉపకేంద్రాల నిర్మాణం మరింత ఆలస్యం కానుంది.

నగరంలో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లు ఉన్నాయి. ఒక్కో జోన్‌లో నిర్మించే ఉపకేంద్రాలన్నింటికీ కలిపి ఒకటే టెండర్ వేయాలనే నిబంధనను సంబంధిత శాఖ మంత్రి ఆదేశాలతో డిస్కం తీసుకొచ్చింది. రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 88 విద్యుత్తు ఉపకేంద్రాలకు జోన్ల వారీగా గత నెలలో టెండర్లు పిలిచింది. స్పందన లేకపోవడంతో మొదటిసారి వారంగడువు పొడించారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో రెండోసారి గడువు పెంచారు. 24వ తేదీతో అదీ ముగిసింది. మూడోసారి పొడిగించే అవకాశం లేదని మాస్టర్‌ప్లాన్ అధికారులు తెలిపారు. కార్పొరేట్ కార్యాలయం ఆదేశాల మేరకు తదుపరి నిర్ణయాలు ఉంటాయన్నారు. వీటికి వారం గడువు పొడిగింపు: జోన్ల వారీగా సింగిల్ టెండర్లకు స్పందన లేకపోవడంతో ఇదివరకే 88 ఉపకేంద్రాల నుంచి ఐదు ఉపకేంద్రాలను మినహాయించి పాత విధానంలో సబ్‌స్టేషన్ వారీగా టెండర్లను అధికారులు పిలిచారు. గడువు శుక్రవారం ముగిసినా బిడ్లు దాఖలు కాకపోవడంతో మరో వారం పొడిగించాలని నిర్ణయించారు.

# శుద్ధి కాలేదు.. మురుగు వదల్లేదు



హైదరాబాద్ : వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు నుంచి ప్రజలకు ఉపశమనం లభించట్లేదు. పాతికేళ్లుగా నగరంలో ఉత్పత్తయ్యే చెత్తను తమ గ్రామంలో పడేస్తున్నారని, కోటిన్నర మంది నివసించే హైదరాబాద్‌ను ఒకేఒక్క డంపింగ్‌యార్డుతో నడిపిస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు ఎగురుతూ, దుర్వాసనతో ఆ ప్రాంతం అధ్వానంగా మారుతోంది. అక్కడి ప్రజల సమస్యలు, భూగర్భ జలాలు, చెరువుల కాలుష్యం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించగా అనేక లోపాలు వెలుగులోకి వచ్చాయి.

**అమలుకాని నిబంధనలు**

డంపింగ్‌యార్డు చుట్టూ ప్రహరీ నిర్మించుకుని, లోపల ఉత్పత్తయ్యే మురుగునీటిని లోపలే శుద్ధి చేయాలన్న నిబంధనను నిర్వాహకులు అమలు చేయట్లేదు. చెత్తకుప్పల్లో ఉత్పత్తయ్యే విష వాయువులను సాయంత్రం 5.30గంటల నుంచి గాల్లోకి వదులుతున్నట్టు కార్మికనగర్, గబ్బిలాలపేట ప్రజలు వాపోతున్నారు. కార్మికనగర్ నుంచి హరిదాసుపురం వెళ్లే మార్గంలోని చెరువు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అందులోంచి ముక్కుపుటాలు అదిరిపోయేలా దుర్వాసన వస్తోంది. కొన్ని రోజులుగా డంపింగ్‌యార్డు ప్రధాన ద్వారం ఎదురుగా ఉండే కుంటలోకి మురుగును మళ్లిస్తున్నారని, ఆ నీరు స్వచ్ఛమైన నీటితో ఉండే ఏదులకుంటను నాశనం చేస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ సీనియర్ ఇంజినీరును వివరణ కోరగా.. 'మల్కారం చెరువులోని గాఢ జలాన్ని (లీచేట్) శుద్ధి చేసే పనులు మెరుగ్గా జరుగుతున్నాయి. నిదానంగా భూగర్భ జలాలు మెరుగుపడతాయి. ఆ ప్రాంతంలో దుర్వాసన తగ్గింది."అని వివరణ ఇచ్చారు.

**ప్రకటనకు భిన్నంగా..**

నగరంలో ఉత్పత్తయ్యే చెత్తను 15 ఏళ్లుగా జవహర్‌నగర్‌లో పడేస్తున్నారు. 2010 నుంచి వ్యర్థాలను మెరుగ్గా నిర్వహించే పనులు మొదలయ్యాయి. జీహెచ్‌ఎంసీ, గుత్తేదారు సంస్థ నిర్లక్ష్యంతో ఐదేళ్ల క్రితం వరకు చెత్తకుప్పలు బయటికి కనిపించేవి. వర్షాలు, ఇతర సమయాల్లో చెత్త నుంచి ద్రవించే మురుగునీరంతా పక్కనున్న మల్కారం చెరువులోకి చేరుతోంది. ఏళ్లుగా అదే పరిస్థితి ఉండటంతో చెరువులోని మురుగు కఠినమైన ఆమ్లంలాంటి ద్రవంలా మారింది. అమ్మోనియా, ఇతరత్రా లోహాలతో నిండిన హానికర నీటిని శుద్ధి చేయాలని 2021లో జీహెచ్‌ఎంసీ రూ.251కోట్లతో శుద్ధి పనులు చేపట్టింది. 90శాతం తేటగా కనిపించే శుద్ధ జలంగా మార్చి, దిగువకు వదిలేశామని తాజాగా రాంకీ సంస్థ ప్రకటించింది. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి.

డంపింగ్ యార్డు విస్తీర్ణం: 351 ఎకరాలు

2021 నాటికి మల్కారం చెరువులోకి చేరిన కఠిన జలాలు: 9 లక్షల కిలో లీటర్లు

రోజు వచ్చే చెత్త: 8 వేల టన్నులు

గాఢ మురుగు జలాలు శుద్ధి చేసే ప్రాజెక్టు విలువ: రూ.250 కోట్లు

ఇప్పటివరకు పూర్తయిన శుద్ధి: 90 శాతం

**చెరువుల్లోకి చేరి..**

దిగువకు పంపిస్తున్న నీటిని పరిశీలించగా ముదురు పసుపు రంగులో కనిపించింది. ఆ నీరంతా వెళ్లి గొలుసుకట్టు చెరువులైన చీర్యాల పెద్దచెరువు, సూర్యనారాయణ చెరువు, ఏదులాబాద్ చెరువు, ఓ కుంటలో చేరుతోంది. కొన్నేళ్లుగా చెరువుల్లో నిల్వ ఉండటంతో.. పంట పొలాలు నిరుపయోగంగా మారాయి. దుర్వాసనతో చీర్యాల చెరువు కట్టకు స్థానికులు గండికొట్టారు. దిగువనున్న రెండు చెరువులు, కుంటదీ ఇదే పరిస్థితి. హరిదాసుపల్లి, తిమ్మాయిపల్లిలోని కొంత భాగం, చీర్యాల, అహ్మద్‌గూడ, గోదుమకుంట, కుందన్‌పల్లి, రాంపల్లి, ఏదులాబాద్, దమ్మాయిగూడ, జవహర్ నుంచి అల్వాల్ వరకు పలు గ్రామాలను దుర్వాసన, కలుషిత జలాల సమస్య వేధిస్తోంది.

**ఊరు ఖాళీ అవుతోంది..: లక్ష్మారెడ్డి, హరిదాసుపురం**

డంపింగ్‌యార్డు, మల్కారం చెరువుకు సమీపంలోనే మా ఊరు ఉంది. ఒకప్పుడు వరి, మొక్కజొన్న, కూరగాయలు, ఆకుకూరలు పండించేవాళ్లం. చెరువులో మురుగునీటిని నిల్వ చేయడంతో భూగర్భ జలాలు ఎర్రగా మారాయి. నాణ్యమైన పంటలు రావట్లేదు. గాలి, వాతావరణం దుర్భరంగా మారాయి. రైతులంతా ఊరు విడిచి వెళ్లారు. పక్కనున్న గ్రామాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకుంటున్నారు.

# పురపాలికల పగ్గాలు ప్రత్యేకాధికారులకు!



హుజూరాబాద్ : పురపాలికల పగ్గాలు ఇక ప్రత్యేకాధికారుల చేతుల్లోకి వెళ్లనున్నాయి. మున్సిపల్ పాలకవర్గాల పదవీ కాలం రెండ్రోజుల్లో ముగియనుండగా ఆ దిశగా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 14 పురపాలికలకు 2020 జనవరిలో ఎన్నికలు జరిగాయి. అదే నెల 27న పాలకవర్గాలు కొలువుదీరాయి. ఈ నెల 26న పురపాలక సభ్యుల పదవీకాలం ముగుస్తుండగా ఇప్పట్లో ఎన్నికలు జరిగే అవకాశం లేదు. ఇప్పటికే గ్రామపంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌ల సభ్యుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరిగిన తర్వాతే మున్సిపాలిటీలకు నిర్వహిస్తారు. దీనికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశముండటంతో అప్పటి వరకు పురల్లో ప్రత్యేకాధికారుల పాలన తప్పనిసరి కానుంది. రాష్ట్రంలో 2019 జులై 2న పురపాలిక పాలకవర్గాల పదవీ కాలం ముగిసినా.. అప్పటి ప్రభుత్వం కొత్త మున్సిపల్ చట్టం తీసుకురావడం, ఓటర్ల గణన, వార్డుల విభజన, రిజర్వేషన్ల అమలు ప్రక్రియ పూర్తి చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించింది. అప్పుడు కూడా ప్రత్యేకాధికారులను నియమించి ఆరు నెలల పాటు పాలన కొనసాగించింది.

**అయిదేళ్ల పాలన ఇలా..** ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో మెజార్టీ స్థానాలు భారాస కైవసం చేసుకున్నప్పటికీ ఆ అయిదేళ్ల పాలనలో చెప్పుకోదగ్గ ప్రగతి జరగలేదు. 2020లో కరోనా కారణంగా ఏడాదిన్నర కాలంలో అభివృద్ధి నిలిచిపో యింది. అనంతరం పురపాలికల్లో సమీకృత భవనాలు, డంపింగ్ యార్డులు, మురికికాలువలు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినా పూర్తిస్థాయిలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు రాకపోవడంతో అసంపూర్తిగానే మిగిలాయి. పట్టణ ప్రగతి కింద ప్రతినెల నిధులు రావడంతో త్వరితగతిన బిల్లులు విడుదలవుతాయని భావించి కౌన్సిలర్లు గుత్తేదారులుగా అవతారమెత్తి పనులు చేశారు. మరికొందరు బినామీలతో, పుర ఛైర్మన్‌లు కూడా బినామీల పేరిట పనులు చేశారు. 2024 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. పట్టణ ప్రగతి నిధులు జాడ లేదు. ఏడాది నుంచి పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయాయి. విలీన గ్రామాలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. ఫలితంగా బిల్లుల చెల్లింపులు నిలిచిపోయి పనులు దక్కించుకున్న గుత్తేదారులు చేతులెత్తేశారు. టెండర్లు పిలిచినా ముందుకు రావడం లేదు. ప్రజాప్రతినిధులు బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో అయోమయంలో పడ్డారు.

# గ్రాఫిక్ డిజైనర్.. నకిలీ నోట్ల క్రియేటర్



చర్లపల్లి : తక్కువ సమయంలో పెద్దఎత్తున డబ్బు సంపాదించాలనే ఆశతో నకిలీ నోట్ల తయారీని వృత్తిగా మలచుకున్న యువకుడిని రాచకొండ ఎస్‌వోటీ, పహాడీషరీఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రూ.5లక్షల విలువైన 1000 రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. నేరెడ్‌మెట్ రాచకొండ పోలీసు కమిషనరేట్‌లో ఎస్‌వోటీ డీసీపీ మురళీధర్‌తో కలసి సీపీ జి.సుధీర్‌బాబు మీడియాకు వివరాలు వెల్లడించారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం అమరచింతకు చెందిన నవీన్‌కుమార్(26) సివిల్ బ్రాంచ్‌లో డిప్లొమా చేశాడు. సరైన ఉద్యోగం దొరక్క మల్టీమీడియా, గ్రాఫిక్ డిజైన్, వెబ్ డిజైన్, డిజిటల్ మార్కెటింగ్ నేర్చుకున్నాడు. కరోనా సమయంలో కొలువు లేక ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడ్డాడు. కొన్నిరోజులు ఉబర్, ర్యాపిడోలో బైక్‌ట్యాక్సీ నడిపాడు. సంపాదన చాలకపోవటంతో 2023 ఆగస్టులో నకిలీనోట్ల తయారీపై దృష్టి పెట్టాడు. డిజైనింగ్ సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు ఉండటాన్ని అనువుగా మలచుకున్నాడు. నకిలీ నోట్ల తయారీకి అవసరమైన సామగ్రి కోసం అంతర్జాలంలో వెతికే క్రమంలో కోల్‌కతాకు చెందిన వ్యాపారితో పరిచయం ఏర్పడింది. కొంతకాలం కోల్‌కతా రప్పించుకొని శిక్షణనిచ్చాడు. నోట్ల తయారీ ముఠాలతో సంబంధాలున్న గుజరాత్‌కు చెందిన వ్యక్తిని నవీన్‌కుమార్‌కు పరిచయం చేశాడు. ముగ్గురు ముఠాగా ఏర్పడి భారీగా రూ.500 నోట్లను ముద్రించాలనే పథకం వేశారు. రూ.లక్ష నకిలీ నోట్లు తయారు చేస్తే రూ.10వేలు కమీషన్ ఇస్తానని ఇతడికి ఆశచూపారు. ముడి సామగ్రి, మెషినరీ కోసం అవసరమైన డబ్బును కర్నూలులోని అతని స్నేహితుడి నుంచి అప్పుగా తీసుకున్నాడు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం దివిటిపల్లి కేసీఆర్‌నగర్‌లోని ఓ ఇంటిలో నకిలీ నోట్ల తయారీ మొదలు పెట్టాడు. తక్కువ సమయంలోనే రూ.5 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లు తయారు చేశాడు. తుక్కుగూడలో వాటిని ఏజెంట్లకు ఇచ్చేందుకు వెళ్లాడు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో ఈ ముఠాపై నిఘా ఉంచిన పోలీసులు నవీన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ముఠాలోని మిగిలిన సభ్యులకోసం గాలిస్తున్నారు.

# పంటలు లేకున్నా.. పెట్టుబడి సాయం

జగిత్యాల : ఈ చిత్రాల్లో కనిపిస్తున్న భూములు కోరుట్ల నియోజకవర్గంలో ఇళ్లస్థలాలుగా మార్చినవి, జగిత్యాల నియోజకవర్గంలో ఇటుకబట్టీలకు వినియోగిస్తున్నవి. ఇలా జగిత్యాల జిల్లాలో ధరణి(భూభారతి) పోర్టల్‌లో నమోదై ఉండి రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడిసాయం పొంది వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నవి, సాగుయోగ్యంగాని భూములు వేలాది ఎకరాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రైతుబంధు పథకాన్ని రైతుభరోసాగా మార్చి ఈ నెల 26 నుంచి ఎకరాకు ఒక పంటకు రూ.6 వేలు ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం చేపట్టిన క్షేత్ర సర్వేలో అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. జిల్లాలో ఇదివరకు 4.75 లక్షల ఎకరాలకు రైతుబంధు సాయాన్ని వర్తింపచేశారు. 2018 మేలో పథకాన్ని ప్రారంభించినప్పుడు ఎకరాకు రూ.4 వేలు తర్వాత ఎకరాకు రూ.5 వేల చొప్పున రెండు పంటలకు కలిపి రూ.10 వేలు ఇస్తూవచ్చారు. ప్రస్తుతం వ్యవసాయేతర భూములను గుర్తించేందుకు జిల్లాలోని 299 రెవెన్యూ గ్రామాల పరిధిలో వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ఇటీవల సర్వే చేపట్టారు. ఈ సర్వేలో ఇప్పటివరకు 6,207 ఎకరాల భూమి వ్యవసాయేతర అవసరాలకు మళ్లినట్లు లేదా సాగుయోగ్యం కానిది తేల్చారు. ఇందులో మిల్లులు, ఫంక్షన్‌హాళ్లు, రియల్‌ఎస్టేట్ వెంచర్లు, ఇటుకబట్టీలు, ఫారాలు, రహదారులు, గోదాములు తదితరాలున్నట్లు గుర్తించారు. ఓ రైతు తన సాగుభూమిని విభజించి పలువురికి విక్రయించగా రహదారులకు వదిలిన భూమి సదరు రైతు పేరిటనే ఉంటుంది కాబట్టి ఈ భూములను గుర్తించాల్సి ఉంది. ప్రధాన రహదారులు, కాలువలకు వెళ్లిన భూములు, సర్వేనంబర్లవారీగా రాళ్లూరప్పలున్న భూములను గుర్తించాల్సిఉంది. ప్రభుత్వం నుంచి అటవీ యాజమాన్య హక్కులు పొందిన భూములకు పెట్టుబడిసాయం ఇస్తుండగా ఇదే అదనుగా జిల్లాలో ఆక్రమణకు గురైన వేలాది ఎకరాల్లోని అటవీ భూములకు సైతం పెట్టుబడి సాయం వెళుతోందనే విమర్శలున్నాయి. ఆక్రమిత భూముల వివాదాలపై రెవెన్యూ, అటవీశాఖ హద్దులను తేల్చి అర్హులైన రైతులకే రైతుభరోసా వర్తింపచేయాల్సి ఉంది. ఇటీవల జగిత్యాల మండలంలో ప్రభుత్వభూమిని ప్రైవేటువ్యక్తుల పేరిట పట్టా చేయగా జిల్లాలోని పలుచోట్ల ఇలాగే ప్రభుత్వభూమి చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం సమగ్ర పరిశీలన జరిపి ప్రభుత్వ భూమితో పాటుగా సదరు వ్యక్తులు పొందిన పెట్టుబడి సాయాన్ని వెనక్కి తీసుకోవాల్సిఉంది.

పల్లెల్లో వ్యవసాయేతర అవసరాలకు మళ్లిన భూములను సులువుగానే గుర్తించే వీలున్నా పట్టణాలు, మండలకేంద్రాల శివారుల్లో భూములను గుర్తించటం సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో క్షేత్రసర్వేను పొడిగించి సాగుయోగ్యంగాని, సాగేతర అవసరాలకు వాడుతున్న భూములను రైతుభరోసానుంచి తొలగించాలి. జిల్లా అధికారులు ఇప్పటివరకు 6,207 ఎకరాలను గుర్తించినా ఇంతకన్నా చాలా ఎక్కువగానే వ్యవసాయేతర అవసరాలకు మళ్లిన భూమి ఉంది. అతితక్కువ రోజుల్లోనే సర్వే చేయటంతో రైతువారీగా లేదా సర్వేనంబరు వారీగా పరిశీలన కుదరక సమగ్ర గుర్తింపు సాధ్యపడలేదు. కొంతభూమిని నాలాకు మార్చి మిగిలిన భూమిలో పంటలు పండించకున్నా రైతుబంధు సాయంపొందినవి కూడా ఉన్నాయి.

**ప్రభుత్వానికి సమగ్ర నివేదిక** సీహెచ్.రాంచందర్, డీఏవో

ప్రస్తుతం సర్వేలో గుర్తించిన భూముల వివరాలను ఆన్‌లైన్‌చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాము. అన్ని భూముల ఆన్‌లైన్ పూర్తయితే ఏ కేటగిరీ కింద ఎంత భూమి రైతు భరోసా నుంచి తొలగుతుందనేది తేలుతుంది. గ్రామసభలో అభ్యంతరాలు, తదుపరి సమగ్ర క్షేత్రపరిశీలనతో పూర్తి సాగుభూముల వివరాలు ప్రభుత్వానికి చేరతాయి.

# నిబంధనలు.. గోడమీది రాతలేనా?

చేర్యాల: దేవుడి దర్శనానికి వెళ్లే ప్రతి భక్తుడు కొబ్బరికాయ కొట్టడం సర్వసాధారణం. ఇలవేల్పునకు మొక్కు చెల్లించుకునే ప్రధాన కార్యమిది. దీన్ని సైతం అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం వద్ద భక్తుల నిలువు దోపిడీ మరింత పెరిగింది.

**అడ్డూ అదుపూ లేకుండా..:** సాధారణంగా బ్రహ్మోత్సవాల సమయంలో మాత్రమే అధిక ధరలకు అమ్మేవారు. కొబ్బరికాయల విక్రయంలో ఇప్పుడు నిత్యం దోపిడీ సాగుతోంది. ఆలయ నిబంధనలను తుంగలో తొక్కి గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నియంత్రించాల్సిన ఆలయ వర్గాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి. గుత్తేదారులు ఒక్కో టెంకాయను గతంలో ఎన్నడూలేని విధంగా అధిక ధరకు విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏడాది పొడవునా కేవలం రూ.30కి మించి విక్రయించరాదు. ఈ మేరకు బహిరంగ వేలం



రోజునే ఒప్పందంపై సంతకం చేశాకే, ఆలయం ఎదుట కొబ్బరికాయల అమ్మకానికి అనుమతి పత్రం అందిస్తారు.

**గుత్తేదారుల ఇష్టారాజ్యం**

నిబంధనలు మాత్రం పాటించడం లేదు. స్థానికంగా రూ.40కు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పట్నంవారం రోజైతే ఏకంగా రూ.100కు రెండు చొప్పున విక్రయించారు. ఒకటే అవసరమున్నా.. ప్రతి భక్తుడికీ రెండు కొబ్బరికాయలు అంటగట్టారు. ఇదేమిటని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పడం లేదు. వేలం ద్వారా రూ.లక్షలు చెల్లించి హక్కులు దక్కించుకున్నామంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని భక్తులు వాపోతున్నారు. ఇలా ఏటా సుమారు 5 లక్షలకుపైగా కొబ్బరికాయలు అమ్ముడవుతాయి. వాస్తవానికి రెండేళ్ల కిందట ఒక్కో టెంకాయ కేవలం రూ.20కి మాత్రమే విక్రయించాలన్నది ఆలయ నిబంధన. గుత్తేదారు ఎక్కువ ధరకు అమ్ముతున్నారని, నిబంధన సడలించి రూ.30కి అనుమతిచ్చారు. అధిక ధరను నియంత్రించాలన్న ఆలయ వర్గాల నిర్ణయాన్ని గుత్తేదారులు మరోలా అర్థం చేసుకున్నారు. నిర్భయంగా ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. టెంకాయ ధరను ప్రచారం చేస్తూ బోర్డులు పెట్టడంతోపాటు మైక్‌లోనూ చెప్పాల్సిన అవసరముంది.

**నియంత్రణ చర్యలు తీసుకుంటాం..: కురుమ రామాంజనేయులు, ఈవో**

నిబంధన ప్రకారం ఒక్కో టెంకాయ కేవలం రూ.30కే విక్రయించాలి. అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు. వాస్తవ ధరను ప్రచారం చేసి నియంత్రిస్తా. అవసరమైతే లైసెన్స్ రద్దు చేస్తాం.

# పీజీ బోధన అంతంతే!

ఖమ్మం: అది ఖమ్మం నగరంలోని పీజీ కళాశాల.. కాకతీయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పని చేస్తుంది. ఇక్కడ పాఠాలు బోధించే అధ్యాపకులంతా ఒప్పంద, పార్ట్‌టైం పని చేస్తున్నవారే. పూర్తిస్థాయి ఉద్యోగి ఒక్కరూ లేరు. దీంతో విద్యార్థుల చదువులు కుంటుపడుతున్నాయి. ఇక్కడ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, నల్గొండ జిల్లాల విద్యార్థులు వచ్చి చదువుకుంటారు.

**రెండు కోర్సులకు ప్రతిపాదనలు...**

గతంలో ఇక్కడ ఎంసీఏ కోర్సు ఉండేది. విద్యార్థులు చేరక రద్దు చేశారు. ల్యాబ్ అందుబాటులో ఉంది. ఇప్పుడు కోర్సుకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో రెన్యువల్ చేసుకోవాలని భావిస్తున్నారు. ఈ మేరకు విశ్వవిద్యాలయానికి ప్రతిపాదనలు పంపారు. ఆమోదం వస్తే వచ్చే ఏడాది నుంచి ఎంసీఏ అందుబాటులోకి వస్తుంది. ఎమ్మెస్సీ(మ్యాథ్స్)కూ డిమాండ్ ఉంది. దీన్ని సైతం అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు




ప్రయత్నిస్తున్నారు. కళాశాలలో సదస్సుల నిర్వహణకు విశాలమైన గదులు లేవు. మొదటి అంతస్తులో హాల్ నిర్మాణానికి నిధుల కొరత నెలకొంది. నిధులు మంజూరు చేయాల్సిందిగా ప్రజాప్రతినిధులను అభ్యర్థించారు. **ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్....**ఇదే ప్రాంగణంలోని వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్ రవికుమార్.. పీజీ కళాశాలకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్‌గా వ్యవహరిస్తున్నారు. కళాశాలలో ఇద్దరు ఒప్పంద అధ్యాపకులు, 15 మంది పార్ట్‌టైం అధ్యాపకులు పని చేస్తున్నారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చేకూరి రవికుమార్ మాట్లాడుతూ... రెగ్యులర్ అధ్యాపకులు లేకపోయినా ఆ ప్రభావం విద్యార్థులపై పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బోధనకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. వసతి, ఇతర సౌకర్యాల విశ్వవిద్యాలయం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

# భవన నిర్మాణాలకు గ్రహణం

సంగారెడ్డి : ప్రజలకు విద్య, వైద్యం, ఇతరత్రా సేవలు అందించేందుకు వీలుగా పక్కా భవనాలు నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. రూ.కోట్లలో నిధులు మంజూరు చేసింది. ఆయా నిర్మాణాల పనులు ఏడాది లోపు పూర్తి చేయాల్సి ఉండగా.. సగం చోట్లయినా వినియోగంలోకి రాలేదు. గుత్తేదార్ల నిర్లక్ష్యం, స్థలాల సమస్య, టెండర్లు పిలిచినా పనులు చేపట్టడానికి ముందుకు రాకపోవడం, బిల్లుల చెల్లింపులో జాప్యం తదితర కారణాలతో నిర్మాణాల్లో జాప్యం జరుగుతోంది. జిల్లాలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణాల తీరిది.

**అదనపు నిధులకు నిరీక్షణ**

జిల్లాలో ఒక్కో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించారు. 81 భవనాలు మంజూరు కాగా.. 20 చోట్ల మాత్రమే పనులు తుది దశకు చేరాయి. ఈ నిర్మాణాల పూర్తికి రూ.1.48 కోట్ల అదనపు నిధులు కావాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. మంజూరు కాలేదు. పీహెచ్‌సీ భవనాల పనులకూ అదనపు నిధుల మంజూరు చేయాల్సి ఉంది. జిల్లాకు 105 అంగన్‌వాడీ భవనాలు మంజూరైనప్పటికీ ఒక్కటీ పూర్తికాలేదు. ఒక్కో నిర్మాణానికి రూ.8 లక్షలు కేటాయించారు. అద్దె గదుల్లో అరకొర వసతుల మధ్య చిన్నారులు, గృహిణులు, గర్భిణులకు సేవలు అందించాల్సిన పరిస్థితి నెలకొంది.

**స్థానిక సంస్థలకు ప్రజాప్రతినిధులు లేకపోవడంతో..**

పల్లెల్లో ప్రభుత్వ భవనాలకు స్థలం ఎంపిక నుంచి నిర్మాణం పూర్తై వినియోగంలోకి వచ్చే వరకు స్థానిక సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు చొరవ తీసుకుంటారు. ప్రస్తుతం వారి పదవీ కాలం పూర్తవడంతో చొరవ తీసుకునేవారు కరవయ్యారు. దీంతో గుత్తేదారులు సైతం ఆసక్తి చూపడం లేదని పలువురు పేర్కొంటున్నారు.

**మార్చిలోపు పూర్తి చేస్తాం..: జగదీశ్వర్, పీఆర్ ఈఈ, సంగారెడ్డి**

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు గతంతో పోల్చితే వేగవంతమయ్యాయి. ఇప్పటికీ పనులు ప్రారంభించనివి, అసంపూర్తిగా ఉన్న వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. వచ్చే మార్చిలోపు నిర్మాణాలు వినియోగంలోకి వచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాం. సంబంధిత అధికారులతో మళ్లీ సమీక్ష నిర్వహిస్తాం. కొన్నిచోట్ల గుత్తేదారులు ముందుకు రాకపోవడం పనులపై ప్రభావం చూపుతోంది.

# హరిత వికాసం

అచ్చంపేట : ఉమ్మడి జిల్లాలో అటవీ సంరక్షణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు ఫలితాలనిస్తున్నాయి. 2021-23 మధ్య కాలంలో అటవీ విస్తీర్ణంపై కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ విడుదల చేసిన 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్-2023' ప్రకారం రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అటవీ విస్తీర్ణం తగ్గగా.. 20 జిల్లాల్లో పెరిగింది. అందులో నాగర్‌కర్నూల్ జిల్లాలో 50.33 చదరపు కిలో మీటర్ల మేర పెరిగినట్లు పేర్కొన్నారు. మొత్తం 2,49,668 చ.కి.మీ అటవీ విస్తీర్ణంతో నాగర్‌కర్నూల్ జిల్లా రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంది.

దేశంలోని అటవీ విస్తీర్ణం లెక్కించేందుకు రెండేళ్లకోసారి ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ఉపగ్రహం ద్వారా అధ్యయనం చేస్తోంది. నిర్ణీత ప్రదేశంలో ఉండే చెట్ల సంఖ్యను బట్టి అడవులను దట్టమైన, మధ్యస్థాయి, బహిరంగ అడవులుగా విభజిస్తారు.

**అవగాహన కల్పించడంతో...:** పోడు భూములు, పశువులు, జీవాల మేత, కలప, వంట చెరుకు, తదితర వాటి కోసం సమీప ప్రజలు అడవులను నరుకుతున్నారు. వీరి జీవనాధారం అడవే. దీంతో అటవీ విస్తీర్ణం తగ్గుతుంది. అయితే నాగర్‌కర్నూల్ జిల్లాలో ప్రజలకు అడవుల సంరక్షణపై అవగాహన కల్పించడం.. అడవులపై ఆధారపడకుండా జీవనోపాధి కల్పించడం.. అటవీ ప్రాంతంలోకి ప్రజల ప్రవేశాలను కట్టడి చేయటం.. తదితర కారణాలతో విస్తీర్ణం పెరిగింది.

**నిఘాతోనే ఫలితం...- రోహిత్ గోపిడి, జిల్లా అటవీ శాఖాధికారి, నాగర్‌కర్నూల్**

కలప అక్రమ రవాణ, వ్యవసాయం, పశువుల మేత కోసం చెట్లను నరకడంతో విస్తీర్ణం క్షీణిస్తుంది. దీంతో అటవీ ఆక్రమణలు జరగకుండా సిబ్బంది పకడ్బందీ నిఘా ఉంచారు. నిత్యం అటవీ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు. దీంతో సహజంగానే చెట్లు పెరిగి దట్టమైన అడవిగా మారాయి. వాస్తవానికి నాగర్‌కర్నూల్ జిల్లాలో 52 చ.కి.మీ పైగా విస్తీర్ణం పెరిగింది.

# సిరులవేణికి.. జవసత్వాలు



కొత్తగూడెం : ఏ సంస్థ విజయంలోనైనా సమర్థ మానవ వనరులు కీలకపాత్ర పోషిస్తాయి. ఓ వైపు యాంత్రీకరణ అనివార్యంగా మారిన పరిస్థితుల్లోనూ యువ ఉద్యోగుల నియామకాలతో సిరుల వేణి సింగరేణి కొత్త జవసత్వాలను సమకూర్చుకుంటోంది. ఉత్పత్తిలో కొన్నేళ్లుగా ఆశించిన వృద్ధిని నమోదు చేయలేని నల్లనేలలో.. వచ్చే ఏడాదైనా బొగ్గు నిల్వలను సమృద్ధిగా వెలికితీయాలనే సంకల్పంతో యాజమాన్యం ముందడుగులు వేస్తోంది.

ప్రస్తుతం సింగరేణివ్యాప్తంగా 43 వేల మందికి పైగా రెగ్యులర్ ఉద్యోగులుండగా.. వీరిలో ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా, బీటెక్‌తో పాటు రెగ్యులర్ డిగ్రీలు, ఎంబీఏ విద్యార్హతలు కలిగిన వారే 90 శాతం మంది ఉన్నారు.

**సింగరేణి..** దక్షిణ భారత పరిశ్రమల బొగ్గు అవసరాలను తీర్చడంలో ముందున్న బొగ్గు సంస్థ. కోలిండియా పరిధిలో కీలక భూమిక పోషిస్తోంది. తొలినాళ్లలో భూగర్భగనులపై ఆధారపడటంతో లక్ష మందికిపైగా ఉద్యోగులతో సంస్థ అలరారింది. ఆ తర్వాత ఉపరితల గనుల ప్రారంభంతో క్రమంగా యాంత్రీకరణపై ఆధారపడక తప్పని పరిస్థితి ఎదురైంది. ఫలితంగా.. గత రెండు దశాబ్దాలుగా శాశ్వత ఉద్యోగుల సంఖ్య తగ్గుముఖం పడుతూ వచ్చింది. ఇదే క్రమంలో, గత రెండు మూడేళ్లుగా దేశీయ బొగ్గుకు డిమాండ్ పెరుగుతూ రావడంతో, ఉన్నత విద్యావంతులైన యువతను నేరుగా నియమించుకునేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పూర్వ ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని ఏరియాల్లో ఇదొక కొత్త ఒరవడిగా మారింది. గత నాలుగేళ్లలో నేరుగా నియామకాల ద్వారా విధుల్లో చేరిన వారు 6 వేల మందికిపైగా ఉన్నారు. ఒక్క 2024లోనే 2,165 మంది శిక్షణ అధికారులు, ఇతర ఉద్యోగులుగా బాధ్యతలు చేపట్టారు. వీరిలో దాదాపు 80 శాతం మంది గ్రాడ్యుయేట్లే కావడం విశేషం. మరోవైపు వారసత్వ ఉద్యోగాలూ జోరందుకున్నాయి. ఈ మార్గంలో గనుల్లో చేరిన వారిలో దాదాపు 90 శాతం మంది డిగ్రీ, బీటెక్ పట్టభద్రులే. గతంలో నిరక్షరాస్యులైన ఉద్యోగులు అధిక వేతనాలు అందుకున్నది కేవలం సింగరేణిలోనే. వీరి శాతం దాదాపు తగ్గుముఖం పట్టింది. దశాబ్దం క్రితం నాటికి వీరు 40 శాతం మంది ఉండగా.. ప్రస్తుత ఏడాది నాటికి 10 శాతానికి తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అంతర్గత నియామకాల ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్న నమ్మకంతో నిరుద్యోగ యువత ఉద్యోగాలకు పోటీపడుతోంది.

1871 సంవత్సరంలో సింగరేణి గ్రామంలో మొట్టమొదట బొగ్గు నిల్వలు కనుగొన్నారు. అప్పటి బ్రిటీషు ప్రభుత్వ ఆదేశాలతో 'జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా' అధికారి డా.విలియం కింగ్ అధ్యయనం చేసి బొగ్గు నిక్షేపాలను గుర్తించారు. ఆ తర్వాత బొగ్గు నిల్వలను వెలికితీసేందుకు 1886లో ఏర్పాటైనదే 'దక్కన్ కంపెనీ'. మూడేళ్ల ప్రయత్నాల అనంతరం తొలిసారి ఇల్లెందులో నల్ల బంగారాన్ని వెలికితీశారు. ఇందుకు 1889లో ఇల్లెందులోని స్టుట్ పిట్ గని వేదికగా నిలిచింది. బొగ్గు వెలికితీత పనులకు స్థానికులు భయపడగా.. అప్పట్లోనే యూపీ, బిహార్ తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు తరలొచ్చారు. అలా ప్రస్తుతం సింగరేణిలోని పలు ఏరియాలు మినీ భారత్‌గా రూపాంతరం చెందాయి.

1920లో దక్కన్ కంపెనీ 'ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్'గా మార్పు చెందడం ఓ కీలక పరిణామం. పేరు మార్పును అప్పటి బ్రిటీష్ సర్కారు లండన్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదు చేసింది. 1945లో నిజాం ప్రభుత్వం షేర్లను కొనుగోలు చేయగా.. ఈ పరిశ్రమ క్రమంగా దాని యాజమాన్యంలోకి మారింది. ఆ తర్వాత సంస్థానం భారత్‌లో విలీనం కాగా.. తదనంతర పరిణామాల్లో 'సిరుల వేణి' కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేతుల్లోకి వరుసగా 49, 51 శాతం వాటాలతో వచ్చి చేరింది. రాష్ట్ర విభజనానంతరం ఏటేటా తెలంగాణ ప్రభుత్వానికి ఈ సంస్థ సుమారు రూ.500-రూ.900 కోట్ల రాయల్టీ చెల్లిస్తుండటం కొసమెరుపు.

**సమున్నత లక్ష్యాలతో ముందుకు..**

ప్రస్తుత వార్షిక సంవత్సరానికి 74 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్న సింగరేణి.. యాంత్రీకరణపై దృష్టిసారిస్తోంది. ఓ వైపు యువ ఉద్యోగుల నియామకాలతో పాటే 800కి పైగా అందుబాటులో ఉన్న విలువైన యంత్ర సంపదను సద్వినియోగం దిశగా అడుగులు వేస్తోంది. 2025 నాటికి థర్మల్ విద్యుత్తు వినియోగాన్ని 'నెట్ జీరో' స్థాయికి చేరే లక్ష్యాన్ని విధించుకుంది. 2002 నుంచి 'సింగరేణి ఆవిర్భావ' వేడుకలు జరుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో సంస్థ సాధించిన విజయాలు.. ముఖ్య ఘట్టాలు..

**1 నెట్‌జీరో:** ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధికి సింగరేణి ప్రాధాన్యమిస్తోంది. 2024లో కొత్తగూడెంలో 10.5 మెగావాట్ల సౌరవిద్యుత్తు ప్లాంటును ప్రారంభించింది. 'నెట్ జీరో' లక్ష్యంతో థర్మల్‌కు ప్రత్యామ్నాయంగా సుమారు 300 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తికి చేరువైంది.

**2 కొత్తగనులు:** వచ్చే వార్షిక సంవత్సరాంతానికి ఉమ్మడి ఖమ్మంలోని వీకే ఓసీ, రొంపేడు, బెల్లంపల్లి ఏరియాలో గోలేటి, ఒడిశా రాష్ట్రంలోని నైనీ కోల్‌బ్లాక్‌లు అందుబాటులోకి రానున్నాయి. తాడిచెర్ల బ్లాక్-2ను దక్కించుకునేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సాయంతో కేంద్రంతో సంప్రదింపులు జరుగుతున్నాయి.

**3 రక్షణ..:** గనుల్లో ప్రమాదాలకు అవకాశాలెక్కువ. ఈ క్రమంలో రక్షణతో కూడిన విధులకు ప్రాధాన్యమిస్తూనే.. దురదృష్ట సంఘటనల్లో నష్టపోయిన ఉద్యోగ కుటుంబాలకు అండగా నిలిచే ప్రయత్నం జరుగుతోంది. ఎవరైనా ప్రమాదంలో చనిపోతే రూ.కోటి పరిహారం పొందే 'ఉచిత ప్రమాద బీమా పథకం' ఈ ఏడాది నుంచే అమలులోకి తెచ్చారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులైతే రూ.30 లక్షల ప్రమాద బీమా వర్తిస్తుంది.

4 **విద్యాభివృద్ధి:** సింగరేణి కుటుంబాల పిల్లల కోసం అన్ని నియోజకవర్గాల్లో 'అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాల' ఏర్పాటుకు యాజమాన్యం నిర్ణయించింది. త్వరలో ఇవి ప్రారంభంకానుండగా.. సీబీఎస్ఈ విద్యకూ శ్రీకారం చుట్టింది.

**5 ఉద్యోగాల కల్పన:** కారుణ్య నియామకాల గరిష్ఠ వయో పరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచడం మరో కీలక నిర్ణయం. ఉద్యోగాల భర్తీలో 'స్థానికత' అంశం ప్రభావిత ప్రాంత యువతకు మెరుగైన ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఔట్ సోర్సింగ్‌లోనూ 80 శాతం ఉద్యోగాలు వీరికే దక్కడం ఊరట కలిగించే అంశం.

**6 కార్మిక సంక్షేమం..:** గత దసరా వేళ రూ.796 కోట్లను లాభాల్లో వాటాగా పంచిన సింగరేణి.. దీపావళి బోనస్‌గానూ ప్రతి కార్మికోద్యోగికి రూ.93,750 పంచింది. తొలిసారిగా బీసీ లైజన్ అధికారి నియామకం ఇటీవలే జరిగింది.

**7 నైపుణ్యమస్తు:** యువ ఉద్యోగుల కోసం రామగుండం, మందమర్రి ఏరియాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఈ ఏడాదే ప్రారంభించారు. "కొత్త ఉద్యోగాల కల్పనతో సింరగేణిలో యువరక్తం ప్రవహిస్తోంది. ప్రభుత్వ అండతో సింగరేణి వచ్చే వార్షిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి నమోదులో వృద్ధికి నాంది పలకనుంది. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌కు అనుమతులు వచ్చేలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా ఒడిశా ప్రభుత్వంతో మాట్లాడారు. ప్రమాద రహిత బొగ్గు ఉత్పత్తి, థర్మల్ 'నెట్ జీరో', కార్మిక సంక్షేమానికి పటిష్ఠ చర్యలే యాజమాన్యం తొలి ప్రాధాన్యాలు". ఎన్.బలరాం, సింగరేణి ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

# వ్యవసాయం యువసాయం


కొత్తగూడెం : వ్యవసాయ రంగానికి నేటి యువత క్రమంగా దూరమవుతోంది. కుటుంబ సంప్రదాయంగా వస్తున్న ఈ రంగాన్ని ఎంచుకోకపోవడానికి ముఖ్య కారణం.. అది గిట్టుబాటు కాకపోవడమే. సంప్రదాయ మూస ధోరణులను వీడి.. అధునాతన సాగు విధానాలు, యాంత్రీకరణ, సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటే వ్యవసాయమూ పండుగేనని గుర్తించాలి. నేడు 'జాతీయ రైతు దినోత్సవం' ఉమ్మడి ఖమ్మం జిల్లాకు వ్యవసాయమే ప్రధానాధారం. కానీ, ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల వైపు మళ్లడంతో సంప్రదాయ కుటుంబాలకు చెందిన యువత క్రమంగా ఈ రంగానికి దూరమవుతోంది. ఎంతోమంది ఉపాధి వెతుక్కుంటూ పట్టణాలకు వలస వెళ్తున్నారని తాజాగా 'స్టేట్ ఆఫ్ రూరల్ యూత్ ఎంప్లాయ్‌మెంట్-2024' నివేదిక తేల్చింది. గిట్టుబాటు కాని కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలు కాడిపట్టేందుకు సుముఖత తెలపడం లేదు.

**చిన్న కమతాలే.. పెద్ద సమస్య**

సేద్య భూమిని కమతంగా పిలుస్తాం. సమాజంలో కుటుంబాలతో పాటే చిన్న కమతాల సంఖ్య పెరుగుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో అతి తక్కువ భూమి గల రైతులే ఎక్కువ. ఖమ్మం జిల్లాలో సగటు భూ కమతం 0.91 హెక్టార్లు కాగా భద్రాద్రి కొత్తగూడెంలో అది 1.30 హెక్టార్లుగా ఉంది. చిన్న కమతాలతో సాగు లాభసాటి కావడం లేదని, అందుకే ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సహకార సేద్యంపై నేటి రైతులు దృష్టిసారించాలి.

**సంకల్పం.. సరైన ప్రోత్సాహం అవసరం**

రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్నది ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేశ్ వి పాటిల్ సంకల్పం. వారు కొత్త ప్రయోగాలపై దృష్టిసారించారు. వీటిల్లో 'సమీకృత వ్యవసాయం' ప్రధానమైనది. ఒకే కమతంలో వివిధ రకాల పంటల సాగు, అనుబంధంగా కోళ్లు, చేపలు, పాడిగేదెల పెంపకం వంటివి చేపట్టడమే ఈ విధానం. భద్రాద్రి జిల్లాలో వరి, పత్తి, కందితో పాటు వాణిజ్య పంటలైన ఆయిల్‌పాం, మామిడి తోటలు ఎక్కువ విస్తీర్ణంలో ఉన్నాయి. మిరప, మొక్కజొన్న, పత్తి, కూరగాయల సాగుకు ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచింది. ఆయా పంటల సాగులో సంప్రదాయ పద్ధతులకు బదులు ఆధునిక సాగు విధానాల దిశగా స్థానిక కృషి విజ్ఞాన కేంద్రాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు రైతుల్ని ప్రోత్సహించాలి. కొత్త వంగడాలను



పరిచయం చేయాలి.

**ప్రభుత్వ మద్దతు కీలకం**

యువతరాన్ని వ్యవసాయం వైపు ఆకర్షించడానికి ప్రభుత్వం కొత్త విధానాలు, పథకాలు, ప్రోత్సాహకాలను అందించాలి. తాజాగా తీసుకున్న 'యాంత్రీకరణ పథకం' పునఃప్రారంభ నిర్ణయం ఎంతో మేలు చేయనుంది. ఇదే క్రమంలో స్వయం సహాయక సంఘాల మహిళల ద్వారా అధునాతన పరికరాలను విరివిగా అందుబాటులోకి తేవాలి. విత్తనాలు చల్లే, మందులు పిచికారీ చేసే డ్రోన్ల అవసరం ఎంతో పెరిగింది. సేంద్రియ సాగుకు తగిన ప్రోత్సాహకాలివ్వాలి. డిజిటల్ వ్యవసాయంపై శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు రైతువేదికల్లో అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో వ్యవసాయ శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. సాగు, పెట్టుబడి రుణాలు మరింత సులభతరం చేయాలి. ఉత్పత్తుల నిల్వ, విక్రయాలకు గోదాములు, ఈ-నామ్ వంటి మార్కెటింగ్ వ్యవస్థల్ని బలోపేతం చేయాలి. పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించే వ్యాపార యూనిట్ల స్థాపనకు ప్రాధాన్యమివ్వాలి. ముఖ్యంగా, ఆహార ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు నెలకొల్పాలి. విత్తనోత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయించాలి. 'మహిళా శక్తి' పథకం కింద పంట ఉత్పత్తుల సేకరణ, గ్రేడింగ్, ఎగుమతి యూనిట్లు నెలకొల్పితే సాగుదారులకు గిట్టుబాటు కలుగుతుంది. ఆదర్శ రైతులతో సమావేశాలు నిర్వహించడంతో పాటు రైతు విజ్ఞాన యాత్రలను నిర్వహించాలి. ఇటీవల ఓ పర్యటనలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ అన్నట్టుగా.. 'గ్రామీణ టూరిజం' అభివృద్ధిపైనా దృష్టిసారించాలి.

# మళ్లీ తెరపైకి పాలమూరు -రంగారెడ్డి డీపీఆర్!

మహబూబ్‌నగర్ : కొత్త డీపీఆర్ కావాలని సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) కోరటంతో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల (పీఆర్ఎల్ఐ) ప్రాజెక్టు మరోసారి తెరపైకి వచ్చింది. గత ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్ ప్రకారమే ఇన్నాళ్లు పనులు జరిగాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక 'పాలమూరు' పనుల్లో వేగం తగ్గింది. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని 'పాలమూరు' సహా ఇతర ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులపై రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. భూత్పూర్‌లో జరిగిన రైతు పండగ సభలోనూ సీఎం రేవంత్‌రెడ్డి పాలమూరులోని ప్రాజెక్టులను సాధ్యమైనంతగా పూర్తిచేసుకునేందుకు కృషి చేస్తామని వివరించారు. ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో కొత్త డీపీఆర్ సమర్పించాలని సీడబ్ల్యూసీ కోరటం సందేహాలకు తావిస్తోంది.

**నీటి కేటాయింపులపై.. :** నీటి కేటాయింపుల విషయంలో డీపీఆర్‌ను సీడబ్ల్యూసీ వెనక్కు పంపింది. మైనర్ ఇరిగేషన్‌లో ఆదా చేసిన జలాలు 45.66 టీఎంసీలు పాలమూరు - రంగారెడ్డికి వాడుకుంటామని, అలాగే పోలవరం ప్రాజెక్టు నుంచి కృష్ణా డెల్టాకు మళ్లించే గోదావరి జలాల్లో ఎగువన వినియోగించుకునే వీలున్న వాటాగా మరో 45 టీఎంసీలు పాలమూరు - రంగారెడ్డికి కేటాయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ఈ అంశాలపై స్పష్టత లేకపోవడం, రాష్ట్రాలు విడిపోయిన నేపథ్యంలో సీడబ్ల్యూసీ కొత్త డీపీఆర్ కోరింది. దీనివల్ల పాలమూరు-రంగారెడ్డి పనులపై ప్రభావం పడుతుందా.. నీటి కేటాయింపుల



విషయంలో ఇబ్బందులు ఎదురవుతాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది. గోదావరి వాటాను ఇవ్వకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాల్సి ఉంటుంది. తిరుగు జలాల నీటి కేటాయింపు డిజైన్ మార్చే అవకాశం ఉందా.. ఆయకట్టును మారుస్తారా.. అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త డీపీఆర్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

**పెరిగిన అంచనా వ్యయం..:** శ్రీశైలం వెనక జలాల నుంచి 90 టీఎంసీల నీటిని ఎత్తిపోసి దాదాపు 12.30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించడమే పాలమూరు - రంగారెడ్డి లక్ష్యం. 2015 జూన్‌లో రూ.35,200 కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చింది. మొత్తం 18 ప్యాకేజీల పనులకు టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించింది. ఇప్పటి వరకు దాదాపు రూ.32వేల కోట్లు వెచ్చించింది. నిర్మాణంలో జాప్యం కారణంగా ప్రాజెక్టు వ్యయం గణనీయంగా పెరిగింది. తాజా అంచనా వ్యయం రూ.58,086 కోట్లు. ఇంకా రూ.26వేల కోట్లకు పైగా నిధులు మంజూరు చేస్తేనే పనులు పూర్తవుతాయి. గత బడ్జెట్‌లో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కోసం రూ.1,285 కోట్లు కేటాయించారు.

# మట్టి రోడ్లకు మహర్దశ!

ములుగు : మట్టిరోడ్లతో ఎన్నో దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతున్న 20 గ్రామాల ప్రజల సమస్య తీరనుంది. స్థానిక నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయడంతో పనులు ఊపందుకున్నాయి.

**7 కి.మీ.. 20 గ్రామాలు**

ములుగు మండలం నర్సంపల్లి నుంచి అనంత పద్మనాభస్వామి ఆలయం, క్షీరసాగర్ మీదుగా అనంతారం వరకు 4 కి.మీ., నర్సంపల్లి నుంచి అనంతారం వరకు 3 కి.మీ. ఉన్న మట్టిరోడ్లతో 20 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలపై పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. సమస్యను 'కేబీఆర్ ఫౌండేషన్' ఛైర్మన్ కొన్యాల బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మమత అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన తారురోడ్డు నిర్మాణానికి రూ.3.60 కోట్లు మంజూరు చేస్తూ 2023లో ఉత్తర్వులు ఇచ్చినా నిధులు మంజూరు కాలేదు. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి.

**చురుగ్గా సాగుతున్న పనులు**

అర్ధంతరంగా పనులు ఆగిపోవడంతో మళ్లీ వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. స్థానిక నాయకులు కొన్యాల బాల్‌రెడ్డి ఈ కథనాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం తారురోడ్ల నిర్మాణానికి రూ.6 కోట్లు, క్షీరసాగర్‌లో వేడుక మండప నిర్మాణానికి రూ.1.70 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిధులు మంజూరు కావడంతో అధికారులు పనుల్లో వేగం పెంచారు. త్వరలోనే మిగిలిన పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు తెలిపారు.

# రైలు పట్టాలే యమపాశాలై..!

మహబూబ్‌నగర్ : రైలు పట్టాలపై జరుగుతున్న ప్రమాదాల్లో నమోదవుతున్న మరణాల రేటు అధికమవుతోంది. జాగ్రత్తలు పాటించకుండా పట్టాలు దాటుతూ, మరోవైపు కొంతమంది జీవితంపై విరక్తి, విద్య, ఉద్యోగాల్లో నిరాశచెంది ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య నానాటికి పెచ్చుమీరుతోంది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని రైల్వే పోలీస్ స్టేషన్ (జీఆర్‌పీ) పరిధిలో నిత్యం ఏదో ఓ చోట రైలు కిందపడి మృతి చెందుతున్న సంఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. జీఆర్‌పీ పరిధిలోని మూడు అవుట్‌పోస్టులు షాద్‌నగర్, గద్వాల, కృష్ణాతో పాటు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ల పరిధిలో పోలీసులకు కేసుల విచారణ కత్తిమీద సాములా మారింది. ఓ పక్క సిబ్బంది కొరత, గుర్తుతెలియని వ్యక్తుల వివరాలు తెలుసుకునేందుకు అపసోపాలు పడుతున్నారు. ఈ ఏడాది మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 140 కేసులు నమోదవగా.. అందులో 108 గుర్తించినవి కాగా, మిగతా 32 కేసుల్లో మృతుల వివరాలు తెలియలేదు.

**హృదయ విదారక ఘటనలు..**

జీవితంపై ఆశలు కోల్పోయి రైలు కిందపడి ఆత్మహత్యలు చేసుకునే మరణాలు హృదయ విదారకరంగా ఉంటున్నాయి. ఈ ఘటనల్లో మృతిచెందిన వారి జేబుల్లో ఎలాంటి గుర్తింపు పత్రాలు లేకపోవడం, కుటుంబీకులు, బంధుమిత్రులు ఎవరూ రాకపోవడంతో రైల్వే పోలీసులు అనాథ శవాలుగా తేల్చుతున్నారు. మార్చురీలో వారం పాటు ఉంచి పోస్టుమార్టం అనంతరం పురపాలిక పారిశుద్ధ్య కార్మికులకు అప్పగించి దహన సంస్కారాలు చేయిస్తున్నారు. వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.




## మోదీ నోట 'కోల్డ్ ప్లే' మాట.. కాన్సర్ట్ ఎకానమీకి ప్రధాని బూస్ట్

భువనేశ్వర్: విశ్వవ్యాప్తంగా యువతను ఉర్రూతలూగిస్తున్న బ్రిటీష్ రాక్ బ్యాండ్ 'కోల్డ్ ప్లే'.. ఇప్పుడు భారత్‌లోనూ సందడి చేస్తోంది. ఇటీవల రెండు నగరాల్లో జరిగిన ఈ ఈవెంట్లకు యువత ఫిదా అయ్యారు. ఈ క్రమంలోనే తాజాగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా దీని గురించి మాట్లాడటం ఆసక్తికరంగా మారింది. ఒడిశా పర్యటనలో ఉన్న ప్రధాని.. తన ప్రసంగంలో 'కోల్డ్ ప్లే' ప్రదర్శనలను ప్రస్తావించారు. కాన్సర్ట్ ఎకానమీకి బూస్ట్ ఇచ్చే దిశగా ఆలోచన చేయాలన్నారు.

ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో రెండు రోజుల పాటు జరిగే ఉత్కర్ష ఒడిశా సదస్సుకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ముంబయి, అహ్మదాబాద్‌లో నిర్వహించిన కోల్డ్‌ప్లే కాన్సర్ట్ అద్భుత చిత్రాలను మీరు వీక్షించే ఉంటారు. ఇలాంటి లైవ్ కాన్సర్ట్‌లకు మన దేశంలో మంచి స్కోప్ ఉందని చెప్పేందుకు ఆ షోలు నిదర్శనం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెద్ద పెద్ద కళాకారులు.. ఇప్పుడు భారత్‌వైపు ఆకర్షితులవుతున్నారు" అని మోదీ వ్యాఖ్యానించారు.

**'కోల్డ్‌ప్లే' చాలా హాట్ గురూ..!** "గత 10ఏళ్లుగా లైవ్ ఈవెంట్లు, కాన్సర్ట్‌ల ట్రెండ్ పెరుగుతోంది. దేశంలో కాన్సర్ట్ ఎకానమీ రంగం రోజురోజుకీ వృద్ధి చెందుతోంది. సంగీతం, నృత్యం, కథలకు సంబంధించి మనది ఘనమైన వారసత్వం. ఇలాంటి దేశంలో కాన్సర్ట్‌లకు విశేష ఆదరణ లభిస్తుంది. ఇందుకు తగ్గ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంపై రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగాలు దృష్టి సారించాలి. కాన్సర్ట్ ఎకానమీకి మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టాలి" అని ప్రధాని సూచించారు.

'మ్యూజిక్ ఆఫ్ ది స్పియర్స్ వరల్డ్ టూర్'లో భాగంగా కోల్డ్ ప్లే బ్యాండ్ భారత్‌లో ఐదు కాన్సర్ట్‌లను నిర్వహించింది. వీటికి విపరీతమైన క్రేజ్ లభించింది. ముంబయి, అహ్మదాబాద్‌లో ఇచ్చిన ఈ ప్రదర్శనలకు బాలీవుడ్, క్రీడా ప్రముఖులు హాజరై సందడి చేశారు.




దిల్లీ: ఏపీ సీఎం చంద్రబాబుపై ఉన్న సీఐడీ కేసులను సీబీఐకి బదిలీ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏడు కేసులు సీబీఐకి బదిలీ చేయాలంటూ హైకోర్టు న్యాయవాది బి.బాలయ్య ఈ పిటిషన్ దాఖలు చేశారు.

ఇది పూర్తిస్థాయిలో తప్పుడు పిటిషన్ అని జస్టిస్ బేలా త్రివేది నేతృత్వంలోని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషన్‌కు సంబంధించి ఒక్క మాట మాట్లాడినా భారీగా జరిమానా విధిస్తామని జస్టిస్ బేలా త్రివేది హెచ్చరించారు. బాలయ్య తరఫున వాదనలు వినిపించడానికి సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ సిద్ధమవగా.. ఇలాంటి పిటిషన్లను కూడా మీరు వాదిస్తారా? అని ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది.

ఇలాంటి కేసుల్లో కూడా మీలాంటి సీనియర్లు హాజరవుతారని అసలు ఊహించలేదని వ్యాఖ్యానించింది. ఒక్క మాట కూడా మాట్లాడొద్దంటూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది.

## అప్పుడు కనబడలేదా ఆర్థిక భారం.. షర్మిల ఫైర్



విజయవాడ, జనవరి 28: ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి మరోసారి విరుచుకుపడ్డారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను గుర్తుచేస్తూ కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... సూపర్ సిక్స్ - సూపర్ ఫ్లాప్ అయిందంటూ వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు ఇక శుభం కార్డు పడ్డట్లే .. చంద్రబాబు నిన్నటి ప్రజెంటేషన్ ఇందుకు నిదర్శనం అంటూ కామెంట్స్ చేశారు. నీతి ఆయోగ్ రిపోర్ట్ ముందుపెట్టి, డబ్బులుంటేనే పథకాలని నీతి సూక్తులు చెప్పారని విమర్శించారు. పథకాలు కావాలంటే ఆదాయం పెంచాలట.. మోకాలికి బోడి గుండుకు ముడిపెట్టినట్లుంది చంద్రబాబు తీరు ఉందని అన్నారు. నమ్మి అధికారం ఇస్తే రాష్ట్ర ప్రజలను ఘోరంగా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 లక్షల మంది అన్నదాతలను వంచించారని..80 లక్షల మంది విద్యార్థులకు ద్రోహం చేశారన్నారు. కోటిన్నర మంది మహిళలను మోసం చేశారని ఫైర్ అయ్యారు. 50 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ఆటలు ఆడుకున్నారని అన్నారు.పథకాలకు ఆర్థిక వెసులుబాటు లేదని, వైసీపీ ప్రభుత్వ ఆర్థిక విధ్వంసమే కారణమని, జగన్ ఆర్థిక ఘోరమే నిదర్శనమని చెప్పే బాబు.. ఎన్నికల్లో హామీలు ఇచ్చే ముందు తెలియదా ఈ ఆర్థిక విధ్వంసం, ఘోరం అన్ని ప్రశ్నించారు. "సూపర్ సిక్స్" పథకాల రూపకల్పనలో కనపడలేదా రాష్ట్ర ఆర్థిక భారం అని నిలదీశారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని చెప్పింది మీరే. కూటమిని గెలిపిస్తే 100 రోజుల్లో గాడిన పెడతామన్నది మీరే అని గుర్తుచేశారు. తీరా ఓట్లు పడ్డాక ఇచ్చిన హామీలపై మడతపేచీ పెట్టడం ఎంతవరకు సమంజసమని అడిగారు. రాష్ట్రం అప్పుల్లో ఉందని, అప్పులు పుట్టడం లేదని సాకులు వెతకడం మాని పథకాల అమలుపై దృష్టి పెట్టాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్రంలో పెద్దన్న పాత్ర పోషించే తమరు.. రాష్ట్ర దీనస్థితిపై ప్రధాని మోడీని పట్టుబట్టాలన్నారు. పథకాలకు కావాల్సిన నిధులు ఇవ్వాలని అడగాలన్నారు. నీతి ఆయోగ్ చెప్పినట్లుగా గత ఐదేళ్లల్ల వైసీపీ పాలనలో జరిగిన ఆర్థిక అరాచకంపై వెంటనే ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆదాయం ఏ కోటకు మళ్ళిందో తేల్చాలన్నారు. పథకాలకు కేంద్రం డబ్బులివ్వకపోతే వెంటనే బీజేపీకి ఇచ్చిన మద్దతు ఉపసంహరించుకోవాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

## సుప్రీం కోర్టు డెడ్‌లైన్‌తో కొల్లేరులో మళ్లీ టెన్షన్...

పశ్చిమగోదావరి జిల్లా: కొల్లేరు మళ్లీ టెన్షన్ పెడుతోంది. చేపల చెరువులు పెట్టుకునేవారికి నిద్ర పట్టడంలేదు. సుప్రీం కోర్టు డెడ్‌లైన్‌తో రాజకీయ నాయకులకు సయితం దిక్కుతోచని పరిస్థితి వస్తోంది. కొల్లేరు అభయారణ్యం పరిధి, అక్రమ చెరువుల అంశం మరోమారు చర్చనీయాంశంగా మారింది. కొల్లేరులోని అక్రమ చెరువులను కొట్టేయాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో కొల్లేరు కబ్జాదారులు కంగు తిన్నారు. నిన్న మొన్నటి వరకు తమ చదరంగంలో కొల్లేరును పావుగా వాడుకున్న రాజకీయ పార్టీల పరిస్థితి ఇప్పుడు అయోమయోంలో పడింది. కొల్లేరు కాంటూరు పరిధిని తగ్గించాలని.. కొల్లేరు వాసులు దశాబ్దాలుగా చేస్తున్న వినతి సుప్రీం కోర్టు తాజా ఆదేశాలతో పుట్టదాఖలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

**రాజకీయ నాయకులకు అక్షయపాత్ర :** కొల్లేరు రాజకీయ పార్టీలకు ఎప్పుడూ తరగని సొమ్ములిచ్చే అక్షయ పాత్రే. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కొల్లేరు పరిధిలో ఉండే ఎమ్మెల్యేలు అక్రమంగా చేపల చెరువులు తవ్వడం, తద్వారా కోట్లాది రూపాయలు వెనకేసుకోవడం పరిపాటిగా మారింది. మరోవైపు చూస్తే ప్రతి రాజకీయ పార్టీ కొల్లేరు కాంటూరును కుదిస్తామంటారు. అధికారంలోకి వచ్చాక అధి మాపని కాదని వ్యవహరిస్తారు. 2006 వరకు కొల్లూరు వాసులకు ఈ సమస్య లేదు. తర్వాత ప్రారంభమైన ఈ సమస్య కొల్లేరు గ్రామవాసులకు ఉపాధి ఆహరం లేకుండా చేసింది. వేలాది మంది ప్రజలు వలసలకు దారి తీసింది. కొల్లేరులోని 77,138 ఎకరాలను అభయారణ్యంగా ప్రకటిస్తూ 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ జీవో ప్రకారం ఎటువంటి ఆక్రమణలు అక్రమ చెరువు చేపలు ఉండకూడదు. జీవో జారీ చేసిన టీడీపీ ప్రభుత్వం దాన్ని అమలు చేయకుండా వదిలేయడంతో కొల్లూరు వాసుల ఉపాధికి, అక్రమ చెరువులకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు. అయితే 2006లో జీవో అమలు చేసే క్రమంలో అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం కొల్లేరులోని అన్ని చెరువులను ధ్వంసం చేసింది. దాంతో ఆ చెరువులపై ఆధారపడిన కొల్లేరు వాసులకు ఉపాధి లేకుండా పోయింది. కొన్ని గ్రామాల ప్రజలైతే ఇతర రాష్ట్రాలకు చెరువుల్లో పని చేయడానికి వలస వెళ్లిపోయారు. కానీ 2009లో రానున్న ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని అప్పటి వైఎస్ సర్కార్ కొల్లేరు అభయారణ్యాన్ని 5వ కాంటూరు నుంచి 3వ కాంటూరుకు కుదించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి అప్పటి యూపీఏ సర్కార్‌కు పంపింది. అలా తగ్గించడం వలన అభయారణ్యం విస్తీర్ణం దాదాపు 40 వేల ఎకరాలకు తగ్గి అవన్నీ పేదలకు అందుబాటులోకి వస్తాయనేది ఈ తీర్మానం సారాంశం.

**మళ్లీ తెరపైకి కాంటూరు కుదింపు అంశం..** కేంద్ర రాష్ట్రాల్లో రెండోసారి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మీళ్లీ ఈ సమస్య ఎదురవ్వడంతో అప్పటి పర్యావరణ మంత్రి జయరాం రమేష్ స్వయంగా కొల్లేరులో పర్యటించారు. తర్వాత ఆయన నియమించిన అజీజ్ కమిటీ కొల్లేరులో పర్యటించి కాంటూరు కుదింపు అంశంపై అధ్యయనం చేసింది. అదే కమిటీ కొన్ని నెలల తర్వాత కుదింపు సాధ్యం కాదని తేల్చింది. 2014, 2009 ఎన్నికల్లోనూ కాంటూరు కుదింపు అంశం తెరపైకి వచ్చింది. అన్ని పార్టీలు ఒకే తరహాలో కాంటూరును కుదించేస్తామంటూ హామీలు గుప్పించాయి. అయినా ఫలితాలు శూన్యం. 2024 ఎన్నికల్లో కొల్లూరు అంశం రాజకీయ పార్టీలకు తూరుపు ముక్కగా మారింది. 2019 ఎన్నికల్లో ఈ అంశానని జగన్ తన ఎన్నికల ఎజెండాలో ప్రధాన సమస్యగా ప్రస్తావించారు. ఒక్క అవకాశం ఇవ్వండి కాంటూరు పరిధిని తగ్గించి చూపిస్తానంటూ చెప్పడంతో అక్కడి ప్రజలు నమ్మారు. ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చిన జగన్ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు.

**మార్చి డెడ్ లైన్..** 2024 ఎన్నికల్లో వైసీపీ, టీడీపీలు కొల్లూరు ఓటర్ల ఓట్లు కోసం అన్ని ప్రయత్నాలు చేశాయి. ఈ విషయంలో కొల్లేరు వాసులు టీడీపీని నమ్మి ఆ పార్టీ పక్షాన నిలబడ్డారు. కూటమి అధికారంలోకి రావడంతో కొల్లేరు వాసులకు కాస్త ఊరటనిచ్చాయి. ఈ పరిస్థితుల్లో కొల్లూరు ఆక్రమణలపై సుప్రీం విచారణ చేపట్టింది. దాంతో అటవిశాఖ అధికారులు కొల్లేరులో అక్రమ చెరువులు ధ్వంసం చేయడం మొదలుపెట్టారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన విచారణలో న్యాయస్థానికి న్యాయవాదులు వివరించారు.

ఇంకా 17వేల ఎకరాల్లో అక్రమచెరువులు ఉన్నాయని కోర్టుకు విన్నవించారు. వాటిని కూడా మార్చిలోగా తొలగించాలని న్యాయమూర్తులు ఆదేశించగా ప్రస్తుత అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పుడు ఈ పరిణామాలు అటు ప్రభుత్వానికి ఇటు ప్రజాప్రతినిధులకు మింగుడు పడని విధంగా మారింది.






## ఏబీ వెంకటేశ్వరరావు సస్పెన్షన్ కాలాన్ని క్రమబద్ధీకరిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి: విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) సస్పెన్షన్ కాలాన్ని ఏపీ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. గతంలో జగన్ ప్రభుత్వం రెండు సార్లు ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. మొదటి దఫా 2020 ఫిబ్రవరి నుంచి 2022 ఫిబ్రవరి 7 వరకు.. రెండోసారి 2022 జూన్ 28 నుంచి 2024 మే 30 వరకు సస్పెన్షన్ విధించింది. తాజాగా ఆ కాలాన్ని విధులు నిర్వహించినట్లుగా క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెన్షన్ కాలంలో ఏబీవీకి ఇవ్వాల్సిన మొత్తం వేతనం, అలవెన్సులు చెల్లించాలని స్పష్టం చేసింది. సస్పెన్షన్ వేటు పడకపోతే ఎంతమొత్తం ఇవ్వాలో ఆ మేరకు చెల్లించాలని ఆదేశించింది.

ఏబీవీపై నమోదు చేసిన అభియోగాలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే.





శ్రీకాకుళం: ఏపీలో సైబర్ క్రైమ్ పెరిగిందని.. ఇతర నేరాలు తగ్గి ఈ కేసులు పెరుగుతున్నాయని డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడారు. "సైబర్ క్రైమ్ అనేది దేశవ్యాప్తంగా జరుగుతున్న అంశం. దీనిని ఎలా అదుపు చేయాలనేదానిపై ఆలోచన చేస్తున్నాం. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ పెట్టాలని యోచిస్తున్నాం. నిపుణులను ఉపయోగించుకోవడం.. ప్రజల్లో అవగాహన కల్పించడం ముఖ్యం. ఎవరైనా అపరిచిత వ్యక్తులు ఫోన్ చేస్తే డబ్బులు చెల్లించవద్దు. సైబర్ క్రైమ్ నిరోధానికి ఏకైక మార్గం అవగాహనే.

చిన్నపిల్లలపై, వృద్ధులపై లైంగిక దాడులు పెరుగుతున్నాయి. ఇది సభ్య సమాజం సిగ్గుపడాల్సిన విషయం" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయి నిర్మూలనకు ఐదుగురు క్యాబినెట్ మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈగల్ సంస్థను ఏర్పాటు చేసి గంజాయికి అడ్డుకట్ట వేస్తున్నట్టు వివరించారు. గంజాయి ఎక్కడ పట్టుబడినా వాటి మూలాలు ఉత్తరాంధ్రలోనే ఉంటున్నాయని తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడలో బుధవారం 37వేల కిలోల గంజాయిని దగ్ధం చేయనున్నట్టు వివరించారు. పోలీసులు ఇటీవల సంకల్పం పేరిట మాదకద్రవ్యాల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించి కళాశాలల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు.

**మార్చి ఒకటి నాటికి లక్ష కెమెరాల ఏర్పాటు లక్ష్యం..** నేరాల నియంత్రణలో టెక్నాలజీని మరింతగా వినియోగించుకునేలా మార్చి ఒకటి నాటికి లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు లక్ష్యంగా దృష్టి సారించామన్నారు. సీసీ కెమెరాలను దాతల, ప్రజల సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

ఎక్కడ, ఎటువంటి క్రైమ్ జరిగిన ఏదో ఒక కెమెరాలో రికార్డు కావాలనేదే తమ ప్రయత్నమని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల స్పాట్లను గుర్తించడం జరిగిందని, రెండు లక్షల సీసీ కెమెరాలను ఆ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పోలీసులు ప్రజలకు పారదర్శకమైన సేవలు అందజేయాలని చెప్పారు. రాష్ట్ర మొత్తంగా చూసుకుంటే క్రైమ్ రేట్ తగ్గడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. దేశంలో మావోయిస్టుల ఏరివేత కొనసాగుతోందని వారు ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చే అవకాశం లేదన్నారు. మావోయిస్టుల ఏరివేతను అడ్డుకునేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ సమర్థవంతంగా పనిచేస్తుందని వివరించారు.

## పేర్నినాని ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో ఏం జరిగిందంటే




అమరావతి, జనవరి 28: మాజీ మంత్రి పేర్ని నాని ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఏపీ హైకోర్టు రిజర్వ్ చేసింది. పేర్నినాని, ఆయన సతీమణి జయసుధపై ఉన్న గోడౌన్‌లో రేషన్ బియ్యం మాయం కేసులపై హైకోర్టులో ఈరోజు (మంగళవారం) వాదనలు జరిగాయి. మచిలీపట్నంలో పేర్ని సతీమణి జయసుధ పేరుతో ఉన్న గోడౌన్‌లో పౌరసరఫరాల శాఖకు చెందిన బియ్యం మాయం కేసులో పేర్ని నానిని పోలీసులు నిందితులుగా చేర్చారు. ఈ కేసులో ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పేర్ని తరఫున సీనియర్ న్యాయవాది రవి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు పూర్తి అవడంతో తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో రేషన్ బియ్యం మాయంకు సంబంధించి మాజీ మంత్రి వైసీపీ నేత పేర్నినాని చుట్టూ వ్యవహారం నడుస్తోంది. అతనికి సంబంధించిన రెండు గోడౌన్లలో బియ్యం మాయం అవడం, బియ్యాన్ని ఉద్దేశపూర్వకంగా అమ్ముకున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు రావడంతో విజిలెన్స్, సివిల్స్ సప్లై, పోలీస్ శాఖలు వివిధ కోణాల్లో విచారణ జరపాయి. అయితే ఉద్దేశపూర్వకంగానే బియ్యాన్ని పక్కదారి పట్టించినట్లు నిర్ధారించారు. గోడౌన్‌లు పేర్నినాని సతీమణి జయసుధ పేరు మీద ఉన్న నేపథ్యంలో ఆమెను ఏ1గా చేర్చారు. బియ్యం మాయం వెనక అప్పటి అధికారులు, లారీ డ్రైవర్, రైస్ మిల్లు ఓనర్లపై కేసులు నమోదు చేశారు. అయితే వారిచ్చిన సమాచారం మేరకు ఏ6గా పేర్నినాని చేర్చారు పోలీసులు. విషయం తెలుసుకున్న వెంటనే హైకోర్టులో పేర్నినాని ముందస్తు బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఏ1గా ఉన్న జయసుధతో పాటు మిగిలిన వారికి మచిలీపట్నం జిల్లా కోసం ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది. జయసుధకు మాత్రం ముందస్తు బెయిల్ తీసుకోవడంతో పాటు విచారణకు సహకరించాలని జిల్లా కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణ జరుగుతున్న సమయంలో అరెస్ట్ భయంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనికి సంబంధించి ఇప్పటికే నాలుగు విడతలుగా వాయిదా పడింది. ఇరువర్గాల న్యాయవాదుల వాదనలు విన్న హైకోర్టు ఈరోజు తీర్పును రిజర్వ్ చేసింది. ఈ క్రమంలో హైకోర్టు తీర్పు ఎలా ఉండబోతోంది.. పేర్నినానిని అరెస్ట్ చేస్తారా అనే చర్చ జోరుగా సాగుతోంది.

## తిరుమలకు ఇస్రో ఛైర్మన్.. గగన్‌యాన్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు..



తిరుమల: తిరుమల శ్రీవారిని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్ ఇవాళ (మంగళవారం) దర్శించుకున్నారు. బుధవారం జీఎస్ఎల్వీ ఏఫ్-15 శాటిలైట్‌ని ప్రయోగించనున్న నేపథ్యంలో ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. నారాయణన్‌కు అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. వెంకన్నను దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. శ్రీహరికోట అంతరిక్ష కేంద్రం కొత్త మైలురాయిని చేరుకోబోతున్నట్లు ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. 1979లో శ్రీహరికోట అంతరిక్ష కేంద్రంలో మ్నెదటి ప్రయోగం నిర్వహించగా.. బుధవారం నిర్వహించే ప్రయోగం వందోదని ఇస్రో ఛైర్మన్ తెలిపారు. జీఎస్ఎల్వీ ఏఫ్-15 శాటిలైట్ అంతరిక్షంలోకి పంపడం ద్వారా నావిగేషన్‌ను సులభంగా వినియోగించుకునే అవకాశం లభిస్తుందని నారాయణన్ చెప్పారు. ఇప్పటివరకూ 433 విదేశీ ఉపగ్రహాలను శ్రీహరికోట నుంచి ప్రయోగించినట్లు ఆయన చెప్పుకొచ్చారు. రూ.4 వేల కోట్ల వ్యయంతో మూడో లాంచ్ ఫ్యాడ్ నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. గగన్‌యాన్ ప్రయోగానికి ఈ లాంచ్ ఫ్యాడే ఉపయోగించనున్నట్లు నారాయణన్ తెలిపారు.

## ఉద్యోగుల కాళ్ల దగ్గర మంత్రి నేమ్ ప్లేట్




గుంటూరు, జనవరి 28: గుంటూరు జిల్లా డీఆర్‌సీ సమావేశంలో ఏపీ మంత్రి నారా లోకేష్‌కు అవమానం జరిగింది. సమావేశంలో అధికారులు వ్యవహరించిన తీరు సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. ఉద్యోగుల కాళ్ల వద్ద మంత్రి లోకేష్ నేమ్ ప్లేట్ ఉండటం చర్చనీయాంశంగా మారింది. వేదికపై ఉండాల్సిన రాష్ట్ర మంత్రి నేమ్‌ప్లేట్ ఉద్యోగుల కాళ్ల దగ్గర ఉంచారు. దీంతో కలెక్టరేట్ ఉద్యోగుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈరోజు (మంగళవారం) గుంటూరు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో సమీక్ష మండలి సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా మంత్రిగా ఉన్న లోకేష్ ఈ సమావేశానికి రాలేదు. డయాస్ మీద లోకేష్ పేరుతో ఉండాల్సిన నేమ్‌ప్లేట్‌ను తీసి ఉద్యోగస్తుల కాళ్ల వద్ద పెట్టారు అక్కడి సిబ్బంది. దీన్ని చూసి తోటి ఉద్యోగులు, మీడియా సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తూ, మంత్రిగా ఉన్న లోకేష్ సమావేశానికి హాజరుకానంత మాత్రాన డయాస్ మీద నుంచి ఆయన నేమ్‌ప్లట్‌ను తీసి ఉద్యోగుల కాళ్ల వద్ద పెట్టడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. దీనిపై ఉద్యోగులు ఎలాంటి సమాధానం చెబుతారో చూడాలి.

# సీనియర్ నటి స్టన్నింగ్ అవతార్

లేటు వయసులో ఘాటు ఫోజులతో అదరగొడుతోంది సీనియర్ నటి టబు. ఏజ్ లెస్ బ్యూటీగా ఈ భామ ఫీట్స్ ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతున్నాయి. ఇటీవలే %-%క్రూ%-% చిత్రంలో కృతి సనోన్ లాంటి యంగ్ బ్యూటీతో పోటీపడుతూ గ్లామరస్ పాత్రలో నటించిన టబు ఏజ్ నిజానికి 53. అయినా వయసును కనిపించకుండా తన ఛామింగ్ లుక్స్ తో దాచేస్తోంది ఈ బ్యూటీ. ఇటీవల స్టన్నింగ్ ఫోటోషూట్స్ తో టబు మ్యాజిక్ చేస్తోంది. నేటితరంతో పోటీపడుతున్న ఈ బ్యూటీ వరుస ఫోటోషూట్లను ఇన్ స్టాలో షేర్ చేస్తూ ఆశ్చర్యపరుస్తోంది. తాజాగా మరో కొత్త ఫోటోషూట్‌తో టబు అభిమానుల ముందుకు వచ్చింది. ఇన్‌స్టాలో టబు షేర్ చేసిన



ఫోటోగ్రాఫ్‌లో లాంగ్ ట్రెంచ్ కోట్ ధరించి చాలా స్పెషల్ గా కనిపిస్తోంది. కొన్నిసార్లు సండే షాట్స్! అంటూ ఈ యూనిక్ ఫోటోషూట్ ని షేర్ చేసింది. టబు ఈ లుక్ లో సింపుల్ గా ప్రయోగాత్మకంగాను కనిపిస్తోంది. ప్రస్తుతం ఇది యువతరం హృదయాలను గెలుచుకుంటోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇటీవలే డ్యూన్ ప్రొఫెసీ అనే హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ చిత్రంలో నన్ పాత్రలో అద్భుతమైన నటనతో టబు ఆకట్టుకుంది. లైఫ్ ఆఫ్ పై సహా పలు హాలీవుడ్ చిత్రాల్లో నటించిన టబుకు ఇది పెద్ద ఆఫర్. తదుపరి అక్షయ్ కుమార్ తో కలిసి బూత్ బంగ్లాలో కనిపించనుంది.

ప్రియదర్శన్ దర్శకత్వం వహించిన ఈ హారర్-కామెడీ చిత్రం ఇటీవలే షూటింగ్ ని పూర్తి చేసుకుంది. చివరి రోజు తన బృందంతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక సెల్ఫీ దిగి దానిని టబు షేర్ చేయగా వైరల్ గా మారింది. భూల్ భూలైయా విడుదలైన 14 సంవత్సరాల తర్వాత అక్షయ్ కుమార్ -ప్రియదర్శన్ తిరిగి కలిసి వస్తున్నారు. ఇరవై ఏళ్ల తర్వాత అక్షయ్ తో కలిసి టబు ఈ సినిమాలో నటించింది. ఈ చిత్రం 2 ఏప్రిల్ 2025న విడుదల కానుంది.

# ఆ హీరోతో పూజాహెగ్డే లిప్ లాక్ అంత ప్రమాదమా?

బుట్టబొమ్మ పూజాహెగ్డే నటించిన సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి ఏడాదిన్నరవుతుంది. 'కిసీకా భాయ్ కిసీకా జాన్' తర్వాత అమ్మడు వెండి తెరపై కనిపించలేదు. కమిట్ అయిన హిందీ సినిమాల షూటింగ్ డిలే అవ్వడంతో? రిలీజ్ కి నొచ్చు కోవడం లేదు. ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత అమ్మడు 'దేవా'తో ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఇందులో అమ్మడు షాహిద్ కపూర్ కి జోడీగా నటించింది. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కించిన యాక్షన్ థ్రిల్లర్ పై అంచనాలు భారీగానే ఉన్నాయి. సినిమాలో రొమాన్స్ కూడా ఘాడంగానే కనిపిస్తుంది. తాజాగా సెన్సార్ ముందుకెళ్లిన చిత్రానికి %ఖ/యూ% సర్టిఫికేట్ ఇచ్చింది. అయితే ఈ సినిమాలో చాలా సన్నివేశాలకు...పదాలకు సెన్సార్ కత్తెర వేసింది. సెకాండాఫ్ చాలా



కోతలు పడినట్లు తెలుస్తోంది. కొన్ని రొమాంటిక్ సన్నివేశాలు...అసభ్య పదజాలం ఉన్న సన్నివేశాలతో పాటు సంభాషణలకు కత్తెర వేసారు. ప్రధానంగా సినిమాలో 6 సెకెన్ల లిప్ లాక్ సీన్ కు సెన్సార్ కత్తెర వేసింది. షాహిద్ కపూర్- పూజాహెగ్డే మధ్య ఈ లిప్ లాక్ సీన్ డోస్ ఓవర్ గా ఉండటంతో? కత్తెర వేయక తప్పలేదని తెలుస్తోంది. సాధారణంగా లిప్ లాక్ సన్నివేశాలకు సెన్సార్ అభ్యంతరం చెప్పడం అన్నది చాలా రేర్ గా జరుగుతోంది. సన్నివేశంలో ఘాడతను బట్టి ఉంచాలా? తుంచాలా? అన్నది డిసైడ్ అవుతుంది. అయితే ఈ లిప్ లాక్ విషయంలో సెన్సార్ మరింత లోతుగా విశ్లేషించి ఇలాంటి సన్నివేశాలు యువతపై ప్రభావాన్ని చూపించేలా ఉంటాయని భావించి కట్ విధించినట్లు తెలుస్తోంది. అలాగే మరికొన్ని సన్నివేశాలను ట్రిమ్ చే యాల్సిందిగానూ సూచించిందిట. మొత్తంగా సెన్సార్ అనంతరం 156 నిమిషాల 59 సెకెన్లతో సినిమా కనిపిస్తుంది. ఈ చిత్రం జనవరి 31న విడుదల అవుతుంది.




# 'లైలా' బ్యూటీ ఫుల్ ట్రెండింగ్.. కలర్ ఫుల్ డ్రెస్ లో స్టన్నింగ్ గా..



లైలా బ్యూటీ.. అదేనండీ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ అప్ కమింగ్ మూవీ లైలా ఫిమేల్ లీడ్ ఆకాంక్ష శర్మ.. ఇప్పుడు టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారినట్లు క్లియర్ గా తెలుస్తోంది. తమ ప్రాజెక్టుకు సరైన హీరోయిన్ కావాలంటూ వెతుకుతున్న మేకర్స్ కు సూపర్ ఛాయిస్ ఆమెనేని సినీ పండితులు అంచనా వేస్తున్నారు. కొద్ది రోజులుగా ఆమె పేరు సోషల్ మీడియాలో ఫుల్ ట్రెండ్ అవుతోంది. టాలీవుడ్ లోకి విశ్వక్ సేన్ లైలా మూవీతో అడుగుపెడుతున్న అమ్మడు.. డెబ్యూతో మంచి హిట్ అందుకోవాలని చూస్తున్నట్లు ఉంది. అదే సమయంలో అందాల ఆరబోత విషయంలో తగ్గేదేలే అన్నట్లు సందడి చేస్తోంది.

లైలా ఫస్ట్ సాంగ్ లో బికినీతో సెగలు రేపేసిందని చెప్పాలి. గ్లామరస్ లుక్స్ తో మైండ్ బ్లాక్ చేసిన ఆకాంక్ష.. సోషల్ మీడియాలో చేసే సందడి మామూలుగా ఉండదు. స్టన్నింగ్ పిక్స్ ను ఎప్పటికప్పుడు షేర్ చేస్తుంటోంది. అదిరిపోయే ఫోటోలను తన ఫాలోవర్స్ కోసం పంచుకుంటూ అలరిస్తుంటుందనే చెప్పాలి. ఇక తన మూవీ లైలా కోసం ప్రమోషన్స్ బాగానే చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. వరుసగా పోస్టర్స్ షేర్ చేస్తూ.. అప్డేట్స్ ఇస్తూ సందడి చేస్తున్న అమ్మడు.. తాజాగా కిర్రాక్ లుక్ ను పోస్ట్ చేసింది. అది మూవీలోని లుక్ గా తెలుస్తోంది. కలర్ ఫుల్ ట్రెండీ డ్రెస్ లో తన గ్లామర్ తో ఆకాంక్ష సింపుల్ గా ఫిదా చేసిందనే చెప్పాలి. చూపుతోనే మైండ్ బ్లాక్ చేసిన ముద్దుగుమ్మ.. అందరి దృష్టిని తనవైపు ఈజీగా తిప్పినట్లే ఉంది. వుయ్ ఆర్ ట్రెండింగ్.. అంటూ లైలా ఫస్ట్ సాంగ్ ఇచ్చుకుందాం బేబీ హ్యాష్ ట్యాగ్ ను యూజ్ చేసింది ఆకాంక్ష. ప్రస్తుతం ఆమె లేటెస్ట్ పోస్ట్ వైరల్ గా మారగా.. నెటిజన్లు ఓ రేంజ్ లో రెస్పాండ్ అవుతున్నారు. పిక్ అదిరిపోయిందని చెబుతున్నారు. తెలుగులో బిజీ హీరోయిన్ అయిపోయే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. అయితే టాలీవుడ్ కు ఆమె కొత్త అయినా.. బాలీవుడ్ లో ఇప్పటికే మంచి గుర్తింపు సంపాదించుకుంది. మోడల్ గా, డ్యాన్సర్ గా, యాక్టర్ గా ఆకాంక్ష పాపులరే. పలు ఆల్బమ్స్ తో మెప్పించిన అమ్మడు.. మహేష్ బాబుతో కలిసి సంతూర్ యాడ్ లో సందడి చేసింది. సంతూర్ మమ్మీగా కనిపించింది ఆమెనే. ఇప్పుడు ఆ సంతూర్ మమ్మీ.. లైలా మూవీతో ఎలాంటి హిట్ అందుకుంటుందో వేచి చూడాలి.

# రవితేజ 'మాస్ జాతర' గ్లింప్స్.. ఫుల్ మీల్స్ పక్కా..




టాలీవుడ్ స్టార్ హీరో, మాస్ మహారాజా రవితేజ.. రిజల్ట్ తో సంబంధం లేకుండా వరుస సినిమాలు చేస్తున్న విషయం తెలిసిందే. గత ఏడాది మిస్టర్ బచ్చన్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రాగా.. సరైన హిట్ ను సొంతం చేసుకోలేకపోయారు. ఇప్పుడు మాస్ జాతర సినిమాతో మంచి హిట్ కొట్టాలని పట్టుదలతో ఉన్నారు. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమాలో రవితేజకు జోడీగా డ్యాన్సింగ్ క్వీన్, యంగ్ హీరోయిన్ శ్రీలీల నటిస్తున్నారు. ఇప్పటికే వీరిద్దరూ కలిసి ధమాకా మూవీ కోసం స్క్రీన్ షేర్ చేసుకున్న విషయం తెలిసిందే. బ్లాక్ బస్టర్ హిట్ కూడా అందుకున్నారు.

ఇప్పుడు మరోసారి హిట్ ను సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్ లో భాగంగా మాస్ జాతర మూవీ నుంచి రవితేజ ఫస్ట్ లుక్ ను మేకర్స్ రిలీజ్ చేయగా.. సూపర్ రెస్పాన్స్ వచ్చింది. పోలీస్ ఆఫీసర్ గెటప్ లో రవితేజ అదరగొట్టేశారు. అదే సమయంలో నేడు ఆయన బర్త్ డే సందర్భం గా.. గ్లింప్స్ ను రిలీజ్ చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది గ్లింప్స్. గ్లింప్స్ మెలోడీ మ్యూజిక్ తో మాస్ జాతర గ్లింప్స్ స్టార్ట్ అయింది. పోలీస్ ఆఫీసర్ గెటప్ లో విలన్లను చితక్కొడుతున్న రెండు, మూడు సీన్లు చూపించారు మేకర్స్. టీజర్ మొత్తం రవితేజ చాలా హుషారుగా కనిపించారు. రైల్వే స్టేషన్ లో ఓ అమ్మాయితో 'మనదే ఇదంతా' అంటూ ఇడియట్ మూవీ డైలాగ్ చెబుతారు. ఆ అమ్మాయి శ్రీలీల అని అనిపిస్తుంది. మొత్తానికి గ్లింప్స్ తో మరోసారి వింటేజ్ రవితేజను చూడనున్నామని క్లియర్ గా తెలుస్తుంది. కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో రవితేజ ఆకట్టుకున్నారు. ఫ్యాన్స్ కోరుకునే ఫుల్ మీల్స్ లా సినిమా ఉంటుందని క్లియర్ గా తెలుస్తుంది. భీమ్స్ సిసిరోలియో అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. అలా ఓవరాల్ గా గ్లింప్స్.. సినిమాపై భారీ అంచనాలు పెంచేసింది. రవితేజ పక్కాగా హిట్ కొడతారని అంతా అంచనా వేస్తున్నారు. అదే సమయంలో మాస్ జాతర మూవీకి ఫుల్ టాలెంటెడ్ సాంకేతిక నిపుణులు వర్క్ చేస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. మరి మూవీ ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో వేచి చూడాలి.

# అక్కడ ఇక్కడ కియారాకి కష్ట కాలం..!

బాలీవుడ్ లో మొన్నటిదాకా ఒక రేంజ్ లో దూసుకు పోయిన అందాల భామ కియరా అద్వాని ఇప్పుడు సడెన్ గా వెనకబడిపోయింది. అమ్మడి కెరీర్ గ్రాఫ్ పడిపోవడానికి రీజన్ ఏంటన్నది పక్కన పెడితే చేసిన సినిమాలు కూడా సరైన సక్సెస్ అందుకోకపోవడం వల్ల డల్ అయ్యింది. 2023 లో సత్య ప్రేం కి కథ సినిమాతో అలరించిన కియరా లాస్ట్ ఇయర్ ఒక్క సినిమా కూడా చేయలేదు. ఇక ఈ ఇయర్ మొదట్లోనే రాం చరణ్ తో గేం ఛేంజర్ సినిమా తో వచ్చినా ఆ సినిమా వల్ల ఆశించిన క్రేజ్ తెచ్చుకోలేదు. రాం చరణ్ తో ఆల్రెడీ వినయ విధేయ రామ సినిమా చేసిన కియరా ఆ సినిమా కూడా ఫెయిల్యూర్ అందుకోగా గేమ్ ఛేంజర్ అయినా కాపాడుతుందని ఎన్నో ఆశలు పెట్టుకుంది. తెలుగు సినిమా పాన్ ఇండియా రిలీజ్ అంటే ఇంకేముంది సూపర్ హిట్ పక్కా అనుకున్న కియరాకి ఫలితం



డిజప్పాయింట్ చేసిందనే చెప్పాలి. గేమ్ ఛేంజర్ మీద ఫోకస్ చేస్తూ వచ్చిన ఒకటి రెండు బాలీవుడ్ ఆఫర్లను కాదనేసింది అమ్మడు. కియరా అద్వాని ప్రస్తుతం యష్ తో టాక్సిక్ సినిమాలో నటిస్తుంది. ఆ సినిమాతో పాటు హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి చేస్తున్న వార్ 2 లో కూడా నటిస్తుంది. ఈ రెండు సినిమాల మీద అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది. కె.జి.ఎఫ్ తర్వాత యష్ చేస్తున్న సినిమా కాబట్టి టాక్సిక్ మీద భారీ హైప్ ఉంది. ఇక వార్ 2 గురించి అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. రెండు భారీ సినిమాలే కాబట్టి కచ్చితంగా కియరాకి కాస్త లక్ ఫేవర్ చేస్తే మాత్రం మళ్లీ తిరిగి ఫాంలోకి వచ్చినట్టే లెక్క. ఐతే ఆ సినిమాల రిజల్ట్ మీదే కియరా కెరీర్ ఆధారపడి ఉ ందని చెప్పొచ్చు. అందం అభినయం రెండిటితో అలరించే కియరా తన వరకు సినిమాలకు బెస్ట్ ఎఫర్ట్ పెడుతున్నా ఫలితాలు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండట్లేదు. కియరా బేబీ తిరిగి హిట్ ఫాం ఎక్కాలని ఆమె ఫ్యాన్స్ కూడా కోరుతున్నారు. నెక్స్ట్ రాబోయే రెండు సినిమాల్లో ఒకటి సౌత్ సినిమా ఒకటి బాలీవుడ్ సినిమా కాబట్టి ఏ ఒక్కటి హిట్ పడినా కియరా సత్తా చాటే ఛాన్స్ ఉందని చెప్పొచ్చు.

# నిధి అగర్వాల్ కి పన్నీరు ముక్కలే మటన్ ముక్కలా!

డైటింగ్ పేరుతో సెలబ్రిటీలు రుచికరమైన ఆహార పదార్ధలకు దూరంగా ఉండగా తప్పదు. అప్పుడప్పుడు తప్ప రెగ్యులర్ గా ఇష్టమైన పదార్ధాలు తీసుకోవడం కుదరదు. సెలబ్రిటీ లైఫ్ లో ఇలాంటి త్యాగం తప్పదు. పాత్రల కోసం మరింత స్లిమ్ లుక్ ..జీరో లుక్ లోకి మారాల్సిన వచ్చినప్పుడు ఆహార నియమలు మరింత కఠినంగా పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ కూడా ఎక్కడా కాంప్రమైజ్ అయ్యే పరిస్థితి ఉండదం టోంది. తాజాగా నిధి అగర్వాల్ ఇష్టంగా తినే ఆహారం గురించి ఓపాడ్ కాస్ట్ లో రివీల్ చేసింది. 'ఆహారం గురించి ఎక్కువగా మాట్లాడను. ఎందుకంటే



పోడవైన వాళ్లు అంతా వాటి గురించి ఎక్కువగా మాట్లాడుతారు. నేను మంచి ఫుడీనే. రుచికరమైన ఆహార పదార్ధాలు వేటిని వదలను. కానీ చాలా పరిమితంగానే వాటిని తీసుకుంటాను. ఎక్కుగా ఇంట్లో తయారుచేసిన ఆహారాన్ని తినడానికే ఇష్టపడతాను. చాలా రేర్ గా బయట ఫుడ్ తీసుకుంటాను. పూర్తిగా శాఖాహారిని. నాన్ వెజ్ ఐటమ్స్ జోలికి వెళ్లను. కానీ వెజ్ లో పన్నీరు అంటే ఇష్టం. ఆ టేస్టులో చికెన్..మటన్ టేస్ట్ ఉంటుందని ఫీలై తింటాను. ప్రభాస్ గురించి ఫుడ్ టాపిక్ తెస్తే? ప్రమాదం.

అడగాలే కానీ కాదనకుండా ప్రతీ వంటకం పంపిస్తారు. ఆయన ఆ విషయంలో ఎంతో స్వీట్ పర్సన్' అనేసింది. ఇక నిధి అగర్వాల్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అందం అభినయం గల నాయిక అయినా బిజీ హీరోయిన్ కాలేకపోయింది. ప్రస్తుతం పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తోన్న 'హరిహర వీరమల్లు'లో హీరోయిన్ గా నటిస్తోంది. పవన్ తొలి పాన్ ఇండియా సినిమా ఇది. దీంతో ఈ చిత్రంపై నిధి చాలా ఆశలు పెట్టుకుంది. అలాగే డార్లింగ్ ప్రభాస్ తో కలిసి 'రాజాసాబ్' లోనూ నటిస్తోంది. ఈ సినిమాపై కూడా మంచి అంచనాలున్నాయి. ఇలా ఒకేసారి పవన్ , ప్రభాస్ చిత్రాల్లో భాగమై నెట్టింట వైరల్ అవుతోంది.



# తెలంగాణను ప్రకృతి వనంగా మార్చాలి

## పర్యాటక పాలసీ తీసుకొచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి



శంకర్‌పల్లి: రంగారెడ్డి జిల్లా పొద్దుటూరులో ప్రపంచస్థాయి ఎకో ఫ్రెండ్లీ ఎక్స్‌పీరియం పార్కును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రముఖ సినీనటుడు చిరంజీవి, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో 150 ఎకరాల్లో ఈ పార్కును తీర్చిదిద్దారు. దీనిలో 25వేల జాతుల మొక్కలు ఉన్నాయి. 85 దేశాల నుంచి దిగుమతి చేసుకున్న అరుదైన వృక్షాలు, చెట్లు ఉన్నాయి. ఎక్స్ పీరియం పార్కులో రూ.లక్ష నుంచి రూ. 3.5కోట్ల విలువ చేసే అరుదైన వృక్షాలను అందుబాటులో ఉంచారు. ఇప్పటికే పలు వృక్షాలను సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులు కొనుగోలు చేశారు. రాందేవ్‌రావ్ ఆరున్నరేళ్ల పాటు శ్రమించి ఎక్స్ పీరియంను తీర్చిదిద్దారు. దీనిలో వివిధ ఆకృతుల్లో రాక్ గార్డెన్‌ను సిద్ధం చేశారు. 1500 మంది కూర్చునేలా యాంఫీ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.150 కోట్ల విలువైన మొక్కలు, చెట్లు, వృక్షాలు కలిగిన ఏకైక పర్యాటక ప్రాంతంగా ఇది నిలిచింది.

**తెలంగాణను ప్రకృతివనంగా మార్చాలి..** ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. "అటవీ ప్రాంతాల సందర్శనకు మధ్యప్రదేశ్, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి. మందిరాల దర్శనాల కోసం తమిళనాడు, ఇతర ప్రాంతాలకు వెళుతున్నాం. అన్ని సహజ వనరులు ఉన్న తెలంగాణపై గత ప్రభుత్వాలు దృష్టి పెట్టలేదు. ఎకో టూరిజంపై ఇటీవలే అసెంబ్లీలో చర్చించాం. పర్యాటక పాలసీ తీసుకువచ్చి ఎకో టూరిజాన్ని ప్రోత్సహిస్తాం. ఎకో టూరిజం కింద త్వరలో వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో మరిన్ని పర్యాటక క్షేత్రాలు రావాల్సి ఉంది. వరితో పాటు వాణిజ్య పంటల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. తెలంగాణను ప్రకృతివనంగా మార్చాల్సి ఉంది.

తల్లి పేరిట విద్యార్థులు మొక్కలు నాటి సంరక్షించే విధానం తీసుకొస్తాం. త్వరలో విధివిధానాలు ఖరారుచేస్తాం" అని సీఎం అన్నారు. అనంతరం చిరంజీవి మాట్లాడుతూ రాందేవ్‌ను కొనియాడారు. "పొద్దుటూరు ప్రదేశం నాకు ముందే తెలుసు. నేను ఇల్లు కట్టుకున్నప్పుడే రాందేవ్ నాకు కొన్ని విదేశీ మొక్కలు ఇచ్చారు. మా ఇంటి వద్ద పెరిగిన మొక్కలను చూస్తే చాలా ఆహ్లాదకరంగా అనిపిస్తుంది. మన హైదరాబాద్‌లోనే ఇలాంటి మొక్కలను రాందేవ్ తీసుకురావడం అభినందనీయం. ఆయన వ్యాపారవేత్తగా కాకుండా కళాకారుడిగా కనిపించారు" అని చిరంజీవి అన్నారు.



# ఎక్స్ పీరియం పార్క్ బాగా నచ్చింది.. ఇక్కడ షూటింగ్ చేస్తా

రంగారెడ్డి, జనవరి 28: ప్రపంచంలోని అతి పెద్దదైన ఏకో ఫ్రెండ్లీ పార్కును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మెగాస్టార్ చిరంజీవి మంగళవారం నాడు ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ... "ఎక్స్ పీరియం పార్క్ మీకంటే ముందు నాకు బాగా నచ్చింది. ఎక్స్ పీరియం పార్క్ హైదరాబాద్‌కు తలమణికంగా మారుతుంది. రామ్‌దేవ్ 2000 సంవత్సరంలో మొదలు పెట్టారు. ఇక్కడ ఏర్పాటు చేసిన చెట్లు అన్ని నన్ను టెంప్ట్ చేస్తున్నాయి. రామ్‌దేవ్ చాలా రీసెర్చ్ చేసి విదేశాల మొక్కలు తెచ్చి నాటారు. ఇక్కడ అద్భుతమైన కలాఖండాన్ని నిర్మించారు" అంటూ కొనియాడారు. ముఖ్యమంత్రి ఈ పార్క్‌ను చూసి ముచ్చట పడ్డారని తెలిపారు. ఈ పార్క్‌లో వెడ్డింగ్స్, ఈవెంట్స్ ప్లాన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పార్క్‌తో చాలా మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. రామ్‌దేవ్ ఒక వ్యాపారిలా కనిపించరని.. ఆయన ఒక కళాకారునిగానే కనిపిస్తారన్నారు. హైదరాబాద్ శివారులో ఎక్స్ పీరియం పార్క్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని.. అందుకే మనసుకు దగ్గరయ్యారని తెలిపారు. 25 ఏళ్లుగా రామ్‌దేవ్ మొక్కలు, శిలలపై రీసెర్చ్ చేస్తున్నారని అన్నారు. ఎక్స్ పీరియం పార్క్ తెలంగాణ రాష్ట్రానికి అందం తెస్తుందని.. ఈ పార్క్ ను కళాహృదయంతో చూడాలని అన్నారు. ఎవరైనా భూములు ఉంటే రియల్ ఎస్టేట్ చేస్తున్నారని.. డబ్బులు ఉంటే వ్యాపారం చేస్తున్నారని.. కాని రాందేవ్ ఫ్యాషన్‌తో ఇక్కడ పార్క్ డెవలప్ చేశారని చెప్పారు. వచ్చే చలికాలంలో ఇక్కడ సినిమా షూటింగ్ చేస్తా అని చెప్పినట్లు మెగాస్టార్ చిరంజీవి పేర్కొన్నారు. చిలుకూరులోని ప్రొద్దుటూరు వెస్టన్ సెంటర్‌లో ఎక్స్‌పీరియం పార్క్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, మెగాస్టార్ చిరంజీవి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. 150 ఎకరాలలో అంతర్జాతీయ స్థాయిలో రామ్‌దేవ్‌రావు ఏర్పాటు చేసిన పార్కులో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 25 వేల జాతులకు సంబంధించిన మొక్కలు ఉన్నాయి. అర్జెంటీనా, ఉరుగ్వే, మెక్సికో, సౌత్ అమెరికా, స్పెయిన్, ఇటలీ, న్యూగినియా, ఆస్ట్రేలియా, థాయ్‌లాండ్, ఇండోనేషియా, మలేషియా తదితర దేశాల నుంచి అరుదైన మొక్కలు, చెట్లు, రకరకాల స్టోన్స్, అందమైన శిలలు సేకరించి గార్డెన్‌ను ఏర్పాటు చేశారు.



# మీర్‌పేట హత్యకేసు.. గురుమూర్తి అరెస్ట్

హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన మీర్‌పేట హత్య కేసు నిందితుడు గురుమూర్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ఇంటికి తీసుకెళ్లి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు.

తన భార్య వెంకట మాధవిని గురుమూర్తి కిరాతకంగా హత్య చేసి, మృతదేహాన్ని ముక్కలు, ముక్కలుగా చేసి కుక్కర్‌లో ఉడికించిన సంగతి తెలిసిందే. ఎముకలను కాల్చి బూడిద చేసి చెరువులో పడేశాడు. ఆ తర్వాత ఏమీ తెలియనట్లు ఆమె తల్లి సుబ్బమ్మతో కలిసి జనవరి 16న మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయని తెలుసుకున్న పోలీసులు.. గురుమూర్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

తానే భార్యను హత్య చేశానని గురుమూర్తి అంగీకరించాడు. గురుమూర్తి చెప్పిన విషయాలపై ఆధారాలు సేకరించిన పోలీసులు తాజాగా అతడిని అరెస్టు చేశారు.

# మేం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దది: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: తమ ప్రభుత్వం సాధించిన విజయాల్లో దావోస్ ఒప్పందాల సాధన అతి పెద్దదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సచివాయలంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దావోస్ సదస్సు ద్వారా దాదాపు రూ.1.80లక్షల కోట్ల పెట్టుబడులు సాధించినట్టు చెప్పారు. హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. "ప్రభుత్వంపై కొందరు చేసిన దుష్ప్రచారం పటాపంచలు అయ్యింది. ప్రభుత్వంపై, రాష్ట్రంపై నమ్మకం ఉంచుతూ భారీ పెట్టుబడులకు చాలామంది ముందుకు వచ్చారు. ఈ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచుతూ అంతర్జాతీయ సంస్థలు భారీ పెట్టుబడులు పెడుతున్నాయి" అని సీఎం వివరించారు.



**దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు: శ్రీధర్‌బాబు...** హైదరాబాద్ అంటేనే.. బిజినెస్ అనే బ్రాండ్ ఏర్పడిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. "గతేడాది దావోస్ సదస్సులో రూ.40వేల కోట్ల పెట్టుబడులపై ఒప్పందాలు జరిగాయి. ఇది స్థిరమైన, వ్యాపార అనుకూలమైన ప్రభుత్వం అని వ్యాపారులు విశ్వసించారు. అందుకే 2024 దావోస్ పర్యటనకంటే ఈసారి నాలుగు రెట్లు అధికంగా ఒప్పందాలు జరిగాయి. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ కోసం సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాం. యువతలో సాంకేతిక నైపుణ్యాలు పెంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం. అధునాతన సాంకేతిక నైపుణ్యాలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చేలా ప్రణాళిక రూపొందించాం. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు యువతకు అందించేలా స్కిల్ యూనివర్సిటీ ప్రణాళిక ఉంది. పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యాన్ని నైపుణ్య కల్పనకు కూడా ఇస్తున్నాం. సాంకేతిక నైపుణ్యం, విద్యార్థుల బదిలీ జరిగేలా సింగపూర్‌తో ఒప్పందం చేసుకున్నాం. రూ.450 కోట్లతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు క్యాపిటలాండ్ ముందుకు వచ్చింది. దావోస్ ఒప్పందాల పెట్టుబడులతో కొత్తగా 49,500 ఉద్యోగాలు వస్తాయి. మూసీ నదిని ప్రక్షాళన చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అదిస్తాం" అని శ్రీధర్‌బాబు తెలిపారు.

# ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వర్సెస్ మేయర్ సునీల్ రావు




కరీంనగర్: జిల్లాలో రాజకీయాలు వేడెక్కాయి. మాజీ మంత్రి గంగుల కమలాకర్ వర్సెస్ మేయర్ సునీల్ రావుగా పరిస్థితి ఉంది. ఒకరిపై ఒకరు పోటా పోటీ ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లపై సీపీకి మేయర్ ఫిర్యాదు చేశారు. అలాగే సునీల్ రావుపై జిల్లా కలెక్టర్‌కు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. కాగా మంగళవారంతో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం పదవి కాలం ముగియనుంది.

**మేయర్‌ను సస్పెండ్ చేయాలి..** మరోవైపు నగరపాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న మేయర్ యాదగిరి సునీల్ రావును వెంటనే సస్పెండ్ చేయాలని, ఐదేళ్లలో ఆయన చేసిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టి చట్టపరంగా శిక్షించాలని డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి హరిశంకర్, బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం డిప్యూటీ మేయర్ చల్ల స్వరూప రాణి హరిశంకర్ ఆధ్వర్యంలో 31 మంది కార్పొరేటర్లు కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి మేయర్ సునీల్ రావుపై అవిశ్వాస నోటీసుతోపాటు సస్పెండ్ చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ టికెట్‌పై కార్పొరేటర్‌గా గెలిచి మేయర్‌గా ఎన్నికైన సునీల్‌రావు ఐదేళ్లలో నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల్లో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అధికారం కోసం బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారని, సునీల్‌రావు అవినీతిపై విచారణ జరిపి శిక్షించాలని అన్నారు.

**బీజేపీలోకి సునీల్ రావు..** కాగా లోక్ సభ ఎన్నికల సమయంలో ఎంపీ బండి సంజయ్ కుమార్‌పై విమర్శలు చేసిన మేయర్ సునీల్ రావు, ఎన్నికల తరువాత ఒక్కసారిగా యూటర్న్ తీసుకున్నారు. ఎంపీ సహకారంతోనే స్మార్ట్ సిటీ పనులు కంప్లీట్ అయ్యాయని, ఆయనే ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేయించారని ప్రశంసల వర్షం కురిపించారు. తర్వాత బండి సంజయ్ కేంద్ర మంత్రి అయ్యాక కార్పొరేటర్లందరినీ తీసుకెళ్లి సన్మానం చేయడం, పలుమార్లు ఆయనతో భేటీ కావడంతో అప్పట్లోనే మేయర్ చూపు బీజేపీ వైపు ఉందనే ప్రచారం జరిగింది. అప్పటి నుంచే ఆయన బీఆర్‌ఎస్ తో కూడా కాస్త దూరం పాటిస్తూ వచ్చారు. ఈ క్రమంలో కరీంనగర్‌లోని గోదాంగడ్డ ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో సునీల్ రావు, ఆయన అనుచరులు బీజేపీలో చేరారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌రావు మాట్లాడుతూ.. 'గంగుల కమలాకర్.. కంట్రోల్‌లో ఉండాలె, నాపై చిల్లర ఆరోపణలు చేస్తే అందరి చిట్టా విప్పుతా, మానేరు రివర్ ఫ్రంట్, కేబుల్ బ్రిడ్జి పనుల్లో ఏం జరిగిందో నా వద్ద ఆధారాలు ఉన్నాయి' అన్నారు.

**అధికారంలో ఉన్న పార్టీలోకి వెళ్లడం సునీల్ రావు నైజం.. గంగుల కమలాకర్..** 'మేయర్ సునీల్‌రావు స్వార్థపరుడు.. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్తాడు, వెన్నుపోటు పొడవడం ఆయనకు అలవాటే' అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వచ్చి దొడ్డి దారిన మేయర్ అయ్యారని, ఆయనకు పదవి ఇవ్వొద్దని ఆరోజే చెప్పామన్నారు. అవినీతి బయట పడకుండా, కేసుల నుంచి తప్పించుకునేందుకు బీజేపీలో చేరుతున్నాడని విమర్శించారు.

# 'రైతు బంధు' నిధులు విడుదలయ్యాయా?: కేటీఆర్



నల్గొండ: ఆనాడు నిజాం సర్కారును నిలదీసిన గడ్డ నల్గొండ అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఈ జిల్లాకు మాజీ సీఎం కేసీఆర్ ఏం చేశారని అసెంబ్లీలో ఓ మంత్రి అడిగారన్న ఆయన.. వరి ఉత్పత్తిలో జిల్లాను నెంబర్ వన్ చేశారని చెప్పారు. నల్గొండ క్లాక్‌టవర్ కూడలిలో భారాస రైతు మహా ధర్నా నిర్వహించారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ ధర్నాలో పాల్గొన్నారు. తొలుత నాగార్జున కళాశాల వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ నివాళులర్పించారు. అక్కడి నుంచి క్లాక్ టవర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడు తూ.." రైతు బంధు కింద కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రూ. 73 వేల కోట్లు ఇచ్చింది. నల్గొండ బిడ్డలు జీవచ్ఛవంగా మారడానికి కారణం కాంగ్రెస్. ఆ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రాం రాం అవుతుందని కేసీఆర్ ఎప్పుడో చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా రైతుబంధు నిధులు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది" అని కేటీఆర్ విమర్శించారు.

# అమీన్‌పూర్‌లో మళ్లీ మొదలైన హైడ్రా కూల్చివేతలు

సంగారెడ్డి : హైడ్రా కూల్చివేతలు మళ్లీ మొదలయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ పద్మావతి లే అవుట్‌లో మంగళవారం అధికారులు అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. ఏపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే కాటసానికి చెందిన ఫెన్సింగ్‌ను తొలగించారు. అలాగే వందనపురి కాలనీలో మరికొన్ని నిర్మాణాలను కూల్చివేశారు. కాగా, అమీన్‌పూర్ పెద్ద చెరువును ఆనుకుని ఉన్న పద్మావతి నగర్ లే ఆవుట్..193, 194, 323 సర్వే నెంబర్లలో 24 ఎకరాల్లో విస్తరించి ఉన్న లే అవుట్ కబ్జాకు గురైందని బాధితులు గతంలోనే అధికారులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ పలుకుబడితో చుట్టూ ప్రహరీ నిర్మించారని భాదితులు ఆరోపిస్తున్నారు.

సుమారుగా 2006 నుంచి ఈ అంశం పై పోరాడుతున్నామని తెలిపారు. మొత్తం 294 ప్లాట్స్ తో ఏర్పాటు చేసిన పద్మావతి నగర్ లే అవుట్ విషయంపై నాలుగు నెలల క్రితం బాధితులు మొదటగా హైడ్రాను ఆశ్రయించకారు. సర్వే చేసి మూడు నెలల క్రితం చుట్టూ నిర్మించిన గోడను హైడ్రా అధికారులు కూల్చివేశారు. అయితే కూల్చివేతల తర్వాత కబ్జాదారులు కొద్ది రోజులకే ఐరన్ ఫెన్సింగ్ వేశారు. దీంతో మరోసారి బాధితులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా మళ్లీ కూల్చివేతల పనులను చేపట్టింది.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్ 42 శాతం పెంచిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే రాష్ట్రం రణరంగంగా మారుతుందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. బీసీ వ్యతిరేక చర్యలను ఇప్పటికైనా మానుకోవాలని స్పష్టం చేశారు. రిజర్వేషన్ల పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం కాచిగూడ అభినందన గ్రాండ్ హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన శ్రీరామ్ జ్ఞానేశ్వర్‌కు ఆయన నియామక పత్రం అందజేసి మాట్లాడారు. కుల గణన పూర్తయినప్పటికీ రిజర్వేషన్లు పెంచడానికి ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లు పెంచుతూ అసెంబ్లీలో ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సర్పంచ్, ఎంపీటీస్, జడ్పీటీసీ(%ఖుతీజూఖఅష్ట్ర, వీూఆ,్గూజ%)లలో బీసీలకు 20 శాతం మాత్రమే రిజర్వేషన్లు ఉన్నాయని, వాటిని 42 శాతం పెంచితేనే బీసీలు రాజకీయంగా అభివృద్ధి సాధిస్తారని అన్నారు.

విద్య, ఉద్యోగ రంగాలలో కూడా బీసీ రిజర్వేషన్లను 50 శాతానికి పెంచాలని, బీసీలలోని అన్ని కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కొక్క దానికి వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నీల వెంకటేష్‌బీ వేముల రామకృష్ణ, జిల్లపల్లి అంజి, నంద గోపాల్, మట్ట జయంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ధనికులకు రుణమాఫీ.. ఇదో భారీ కుంభకోణం: కేజ్రీవాల్

దిల్లీ: బిలియనీర్లు తీసుకున్న రుణాలను కేంద్రప్రభుత్వం మాఫీ చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. వారి రుణమాఫీని నిషేధించేలా దేశవ్యాప్తంగా ఒక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేస్తూ.. ప్రధాని మోదీకి ఆయన లేఖ రాశారు. ఆ రుణాల మాఫీ వల్ల ప్రజలకు జరిగే నష్టాన్ని గురించి అందులో పేర్కొన్నారు. "కోటీశ్వరులు తీసుకున్న రూ.వేల కోట్ల రుణాలను కేంద్రం మాఫీ చేస్తోంది. వారికి అనుకూలంగా వ్యవహరిస్తోంది. దీంతో సాధారణ ప్రజలు అధిక పన్ను భారాన్ని మోయలేకపోతున్నారు. బిలియనీర్లకు మాత్రం ప్రయోజనం చేకూరుతోంది. పౌరులు తమ జీతాల నుంచి సగాన్ని పన్నుల రూపంలో చెల్లిస్తుంటే.. మోదీ సర్కారు మాత్రం ధనవంతులకు రుణాలు మాఫీ చేస్తోంది" అని కేజ్రీవాల్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. "సామాన్యులు తీసుకునే గృహ, వాహన ఇతర రుణాలను కేంద్రం ఎందుకు మాఫీ చేయడం లేదు..? ఒకవేళ బిలియనీర్ల రుణమాఫీని ఆపితే.. సామాన్యులపై ఆదాయపు పన్ను, జీఎస్టీ రేట్ల భారాన్ని సగానికి తగ్గించొచ్చు. అంతేకాకుండా, ఆదాయపు పన్ను పరిమితిని రెట్టింపు చేయొచ్చు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తొలగించొచ్చు. ధనవంతులకు రుణమాఫీ అనేది భారీ కుంభకోణం. దీనికి ముగింపు పలికే సమయం ఆసన్నమైంది" అని అన్నారు. కాగా.. త్వరలో దిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 5న పోలింగ్ జరగనుండగా.. 8న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల్లో మరోసారి విజయం సాధించేందుకు ఆప్ తీవ్రంగా శ్రమిస్తోంది. మరోవైపు, కాంగ్రెస్, భాజపా అధికారం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రజలపై హామీలు కురిపిస్తున్నాయి. ఈనేపథ్యంలోనే ధనికుల రుణమాఫీ అంశంపై కేజ్రీవాల్ గళమెత్తారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com